ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 26.0



ఆ భూములేవి?

గత ఐదేళ్లల్లో ఎక్కడికక్కడ భూదందా. కొల్లేరు దగ్గర నుంచి అసైన్డ్‌భూముల వరకు వైసీపీ నాయకుల ఇష్టమే. అసైన్డ్ భూముల వ్యవహారంలో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటుని కొందరు ఏకపక్షంగా లబ్ధి పొందారు. మరికొందరు ఎక్కడి భూమి ఉంటే అక్కడ గెద్దల్లా వాలిపోయారు. మూడో కంటికి తెలియకుండా పని కానిచ్చేందుకు అటు రెవెన్యూ అధికారులు, ఇటు రిజిస్ట్రేషన్ అధికారులు చెరో చెయ్యి అందించినట్టు ఆరోపణలు వచ్చాయి. అసలు ఏ నియోజకవర్గంలో ఎంతెంత భూమి అన్యాక్రాంతమైంది, ప్రస్తుతానికి ఆ భూమి ఎవరి ఆధీనంలో ఉంది, రిజిస్ట్రేషన్ ప్రక్రియ సక్రమంగానే సాగిందా.. లేదా ? అనే దానిపై కూటమి ప్రభుత్వం ఫోకస్ పెట్టింది.

- వైసీపీ హయాంలో భూదందాలపై ఆరా.. వెనుక సూత్రధారుల గుట్టు విప్పేలా చర్యలు
- కొల్లేరు నుంచి అసైన్డ్ భూమి వరకు ఎక్కడికక్కడ ఆరా.. ఆ దిశగా అధికారులకు అందుతున్న సంకేతాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

గత ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి పాలనలో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరించి ఎక్కడికక్కడ ప్రభుత్వ భూములను చేజిక్కించుకున్నారు. తమకు అనుకూల ప్రాంతాల్లో కబ్జా చేశారు. అది వ్యవసాయ పొలమైనా.. గృహావసరాలు తీర్చే భూమి అయినా ఒక్కటే. అసైన్డ్ భూములను ప్రభుత్వం పరిధిలో గుర్తించినా ఎవరి కంటా పడని భూములు అనేకం ఉన్నాయి. దీనినే సాకుగా తీసుకుని ఎక్కడికక్కడ దందాకు దిగారు. ఒకవేళ ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేస్తే కొన్ని నియోజకవర్గాల్లో వారితో చీకటి ఒప్పందాలు చేసుకున్నట్టు సమాచారం. అసైన్డ్ భూముల వ్యవహారంలో జగన్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్‌కు అనుకూలంగా కొంత వెసులుబాటు ఇచ్చింది. నిషేధ భూముల రికార్డులోవున్న కొన్ని భూములను దాని నుంచి తప్పించింది. ఆ భూములన్నింటిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు పక్కాగా ఆదేశాలు జారీచేశారు. దీనికోసమే చాన్నాళ్ల నుంచి ఎదురుచూస్తున్న వైసీపీ నాయకులు ఎక్కడికక్కడ తెగబడ్డారు. పట్టణ ప్రాంతాల్లో చిన్నా చితక విస్తీర్ణంలో భవనాలు నిర్మించుకున్నా, లేదా పాకలు వేసుకున్నా అలాంటి భూములు క్రమబద్ధీకరిస్తామని చెప్పి మరికొందరు దందా చేయగా ఇంకొందరినైతే ఆ ప్రాంతాల నుంచి బలవంతంగా ఖాళీ చేయించారు. అప్పట్లో ఈ వ్యవహారమంతా బయటపడకుండా బాధితులను బెదిరించారు. ఏలూరు కేంద్రంగా అనేకచోట్ల ఈ తరహా దూకుడు ప్రదర్శించారు. అప్పటికి టీడీపీ నేతలు వీటికి అడ్డుకట్ట వేసేందుకు శతవిధాలా ప్రయత్నించారు. చింతలపూడి ప్రాంతంలో ఒకరికి తెలియకుండా మరొకరు అత్యంత రహస్యంగా భూముల స్వాధీనానికి ప్రయత్నించారు. అప్పట్లోనే అసైన్డ్ భూములపై వైసీపీ నేతలు కన్నేసినట్టు సమాచారం బయటకు పొక్కినా ఖాతరు చేయలేదు. ప్రతీ నియోజకవర్గంలోను ఎక్కడ వీలైతే అక్కడ భూదందా కొనసాగించారు. ఇప్పుడు అవన్నీ ఒక్కొక్కటిగా వెలికి తీస్తున్నారు. ఇప్పటికే కొందరు కబ్జా చేసిన భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టుగా అనుమానిస్తున్నారు.



కొల్లేరులో కబడ్డీ

ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు కొల్లేరుపై కబడ్డీ ఆడతారు. ప్రభుత్వం ఆధీనంలో ఉన్న భూమిలో కొన్నేళ్ల క్రితం అప్పుడున్న నిబంధనల మేరకు సొసైటీ చెరువులను తవ్వారు. ఈ చెరువుల్లో పెంచే చేపల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆయా గ్రామాలకు చెందేలా తీర్మానాలు చేశారు. దీనినే సాకుగా తీసుకుని అధికారంలో ఎవరుంటే వారే ఆ చెరువులపై కన్నేయడం, తామే పెత్తనం చేయడం, ఎంతోకొంత ముట్టచెప్పి కొందరు నేతలను తమ గుప్పిట బిగించడం యథావిధిగానే సాగుతోంది. గత ఐదేళ్లల్లో దెందులూరు వైసీపీ నేతలు ఈ విషయంలో ఏకపక్షంగా వ్యవహరించారు. కొల్లేరు వ్యవహారాల్లో పోలీసుల సహకారంతో అజమాయిషీ చేశారు. కైకలూరు, ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో అధికార పక్షమే కొల్లేరు భూములను చెరపట్టింది. అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యేలు దీనికి నాయకత్వం వహించారు. అభయారణ్యంలో ఈ రకమైన చర్యలు కొనసాగుతుంటే మొక్కుబడిగానే కేసులు నమోదు చేసి అటవీ శాఖ మమ అనిపించింది. కొల్లేటి లంక గ్రామాల్లో ఈ తరహా భూములు, చెరువుల ఆక్రమణల విషయంలో అనేకసార్లు రాజకీయ రగడే సాగింది. తాజాగా మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వ్యవహారంలోనూ ఇలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ భూములన్నీ అభయారణ్య పరిధిలో ఉన్నందున ప్రత్యేకించి ఎవరు కబ్జా చేసినా అదేదీ రికార్డులకు ఎక్కడం లేదు. ఎవరిది పైచేయి అయితే వారే పెత్తందారుగా వ్యవహరిస్తారు. ఈ క్రమంలోనే పైపైకి అంతా బాగానే ఉన్నట్టు కనిపిస్తున్నా లోలోన ఈ తరహా దందాతో పాలకపక్ష నేతలు కోట్లు దండుకుంటున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఇప్పటి కూటమి ప్రభుత్వమైనా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందా.. లేదా అనేదే ఇప్పుడు అందరి నోట ప్రశ్నగా మారింది.

భూములన్నీ కాజేసింది ఇక్కడే !

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత ఐదేళ్లలో సాగిన భూదందాలపై ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ భూములను బలవంతంగా ఆధీనంలోకి తీసుకున్నా, లేదా ఆయా భూములను అక్రమ పద్ధతుల్లో రిజిస్ట్రేషన్లు చేసుకున్నా ఆరా తీయాల్సిందిగా ఇప్పటికే రెవెన్యూ యంత్రాంగానికి సంకేతాలు వచ్చాయి. ఆ సంకేతాల మేరకు ఇప్పుడు రెవెన్యూ అధికారులంతా అదే పనిలో ఉన్నారు. నూజివీడు, దెందులూరు, చింతలపూడి, ఏలూరు వంటి నియోజకవర్గాలన్నింటిలోనూ ప్రభుత్వ భూములు పరాధీనమైనట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. అయితే 21 (ఏ) పరిధిలోకి వచ్చే భూములను నిషేధ భూముల జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్ వెసులుబాటు ఇవ్వడంతో గడిచిన ఐదేళ్లల్లో వైసీపీకి అనుకూలురుకు బంగారు బాతుగుడ్డు అయ్యింది. దీనిని అడ్డుపెట్టుకునే రెవెన్యూ సాయంతో కొందరు ఆయా భూములను తమ వారికి దక్కేలా జాగ్రత్త పడ్డారు. ఇలాంటి భూముల విస్తీర్ణం జిల్లాలో తొమ్మిది నుంచి పదకొండు వేల ఎకరాల్లోపు ఉంటుందని కొందరు వాదిస్తుండగా తాజాగా 16 వేల వరకు ఉండొచ్చని మరొక అంచనా. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల నిర్ధారణతోనే ఈ భూముల విస్తీర్ణం ఎంతనేది తేలబోతుంది. ఇంకోవైపు పట్టణ ప్రాంతాలన్నింటి లోనూ చిన్నచిన్న విస్తీర్ణంలో ఉన్న ఖరీదైన భూమిని ఎక్కడికక్కడ స్థానిక తహసీల్దార్ల సహకారంతో కొందరు ఎంజాయ్‌మెంట్ పట్టాలు పొందారు. ఇంకొందరు మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులతో ఆయా భూముల్లో పాగా వేశారు. ఇదంతా మూడో కంటికి తెలియకుండానే జరిగింది. అసలు ప్రభుత్వపరంగా ఉండాల్సిన భూములన్నీ ఎంత మేరకు అన్యాకాంత్రం అయ్యాయి, వీటి వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు, వారి వెనుక కొమ్ముకాసిన అధికారులు ఎవరనే దానిపైన కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇదంతా ఒక రోజులో నిగ్గు తేలకపోయినా క్రమేణా అసలు రహస్యం బయటపడేలా కూటమి ప్రభుత్వం జాగ్రత్త వహిస్తోంది. అసైన్డ్ భూములు, ఇతరత్ర ప్రభుత్వ భూముల వ్యవహారంలో రిజిస్ట్రేషన్లను వీలైతే ఆపివేయడానికి ప్రభుత్వం సిద్ధంగానే ఉన్నట్టు మరికొందరి అంచనా. రిజిస్ట్రేషన్ శాఖపై పూర్తి స్థాయి సమీక్ష చేయడం, ఆ శాఖ అధికారులు లోపాయికారీగా నిర్వహించిన రిజిస్ట్రేషన్లపైన ఆరా తీయబోతున్నట్టు ఇంకో సమాచారం. ఇలాంటి క్రమంలోనే మునిసిపాలిటీల్లో కమిషనర్లు చూసీచూడనట్టు వదిలేసిన భూమి వ్యవహార దందాను వెలికితీయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలుస్తుంది.



మాజీ ఎమ్మెల్యే కొఠారు నివాసం వద్ద మోహరించిన పోలీసులు

కొండలరావుపాలెంలో అటెన్షన్

- మాజీ ఎమ్మెల్యే కొఠారు ఇంటి ముట్టడికి కోమటి లంక గ్రామస్థుల నిర్ణయం
- చేపల చెరువుల లీజు సొమ్ము స్వాహా చేశారని ఆరోపణలు
- అప్రమత్తమైన పోలీసులు.. భారీగా మోహరింపు
- కోమటిలంకలో పోలీస్ పికెట్
- నివురుగప్పిన నిప్పులా వాతావరణం

పెదవేగి/ ఏలూరు రూరల్, ఆగస్టు 2 : పెదవేగి మండలం కొండలరావుపాలెంలో శుక్రవారం ఉదయం నుంచి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటిని కోమటిలంక గ్రామస్థులు ముట్టడించి, దాడి చేసే అవకాశం వుందనే సమాచారంతో ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ అలెర్ట్ అయ్యారు. డీఎస్పీ ఇ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో 250 మంది పోలీసు బలగాలను గ్రామానికి పంపించి భారీ బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం వరకు ఎవరూ రాకపోవడంతో 30 మంది ప్రత్యేక పోలీసు దళాలు మినహా మిగిలిన వారు వెనుదిరిగారు. అసలు విషయంలోకి వెళితే.. ఏలూరు రూరల్ మండలం కోమటిలంకలో వంద ఎకరాల్లోని చెరువులను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లీజు పేరిట అప్పటి ఎమ్మెల్యే అబ్బయ్య అనుచరులు హస్తగతం చేసుకున్నారు. ఈ చెరువుల్లో శ్రీపర్రు గ్రామస్థులకు వాటా చెల్లించాలి. అయితే లీజు సొమ్మును చెల్లించకుండా అబ్బయ్య, అతని అనుచరులే బొక్కేశారని గ్రామస్థులు ఆరోపించారు. ఎన్నిసార్లు అడిగినా దాట వేత ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు అనంతరం విదేశాలకు వెళ్లిన ఆయన గురువారం తిరిగొచ్చారు. సమాచారం తెలిసి టీడీపీ నాయ కుల ఆధ్వర్యంలో కోమటిలంక గ్రామస్థులు మూకుమ్మడిగా శుక్రవారం ఆయన ఇంటి ముట్టడికి నిర్ణయించారు. అప్రమత్తమైన పోలీసులు మాజీ ఎమ్మెల్యే ఇంటి వద్ద భారీ గా మొహరించారు. మరోవైపు కోమటిలంక సెంటర్‌లో ఉదయాన్నే పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి గ్రామస్థులు, టీడీపీ నాయకులను అడ్డుకున్నారు. కోమటిలంక టీడీపీ నాయకులు శ్యాంబాబు, నటరాజు, చిన్ని, మహంకాళి, పోతురాజు, ముంగర నాగరాజు తదితరులను గ్రామం విడిచి ఆందోళనకు వెళ్లకుండా కట్టడిచేశారు. ప్రస్తుతానికి వివాదం సద్దుమణిగినా నివురుగప్పిన నిప్పులా ఉంది. మరోవైపు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను గ్రామ పెద్దలు, చెరువు లీజుదారులు కలసి విషయం తెలిపారు.



ఉల్లిపాయలు, బంగాళ దుంపలు తరలిస్తుండగా పట్టుబడ్డ వ్యాన్ (ఫైల్)

ఆ ..అధికారులపై చర్యలేవీ ?

- అక్రమాలకు పాల్పడినట్టు తేలినా చర్యలకు వెనుకంజ
- పంచనామా చేసి వ్యాన్‌ను వదిలేసిన అధికారులు
- వేలేరుపాడులో వరద బాధితులకు ప్రభుత్వ సాయంలోను మొండిచేయి
- నేటికీ అందని ఆర్థిక సాయం, నిత్యావసరాల పంపిణీ

వేలేరుపాడు, ఆగస్టు 2 : వరద బాధితులకు పంపిణీ చేసేందుకు తెచ్చిన ఉల్లిగడ్డలు, బంగాళ దుంపలు అక్రమంగా తరలిస్తుండగా బుధవారం జనసేన నాయకులు వెంబడించి పట్టుకుని అధికారులకు అప్పగించారు. వ్యాన్‌లో వున్న సరుకును స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు పంచనామా చేసి వ్యాన్‌ను డ్రైవర్‌తో సహా పంపించి వేయడంపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అక్రమ తరలింపు వ్యవహారంలో ఓ రెవెన్యూ అధికారి హస్తం ఉన్నట్టు తేలినా ఆయనపై చర్యలకు ఉపక్రమించేందుకు జిల్లా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. 40 క్వింటాళ్ల ఉల్లిగడ్డలు, బంగాళదుంపలను పట్టపగలే వ్యాన్‌లో లోడ్ చేసి పంపించడంలో ఆయనకు మరో ఇద్దరు సహకారం అందించారని విచారణలో తేలింది. దీనిపై మండల రెవెన్యూ అధికారులు నామమాత్రంగా విచారణ చేసి నివేదికను ఆర్డీవోకు సమర్పించారు. ఓ వైపు పెద్ద వాగు, మరో వైపు గోదావరి వరదలతో అనేక ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలకు సాయం చేసేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని కూరగాయలు, నిత్యావసర సరుకులను జిల్లా సివిల్ సప్లైస్ ద్వారా పంపించారు. ఇలా పంపిన సరుకులను స్థానిక కొందరు రెవెన్యూ అధికారులు, సివిల్ సప్లైస్ అధికారులు పూర్తిస్థాయిలో పంచకుండా అరకొరగా పంపిణీ చేసి పెద్దఎత్తున బ్లాక్ మార్కెట్‌కు తరలించారనే ఆరోపణలు వస్తున్నాయి. 40 క్వింటాళ్ల ఉల్లిగడ్డలు, బంగాళదుంపలను చింతలపూడి లోని ఒక వ్యాపారికి విక్రయించేందుకు తీసుకెళ్తుండగా పట్టుబడినట్టు తెలుస్తోంది. అంతకు కొన్ని రోజుల ముందు పెద్దఎత్తున సరుకులు అక్రమ రవాణా జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ రవాణా కేసును నీరు గార్చే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నా రని మండల వాసులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ సాయంలోను మొండిచేయి

గడిచిన 20 రోజులుగా గోదావరి వరదల కారణంగా వేలేరుపాడు మండలంలోని 34 గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వచ్చే వీలు లేకపోవడంతో అధికారులు పడవలపై నిత్యావసర సరుకులు, బియ్యం అందించగా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క బాధిత కుటుంబానికి రూ.3 వేలు ఆర్థిక సాయం ప్రకటించి విడుదల చేసింది. ప్రభుత్వం పంపించిన అన్ని రకాల సహాయాలు మండలంలోని 33 గ్రామాలకు అందగా వేలేరుపాడులోని గ్రామస్థులకు కూరగాయలు తప్ప ఏ విధమైన ఇతర సహాయం అందలేదు. సంత మార్కెట్ సెంటర్, రజక బజారు, ఎస్టీ కాలనీ, ఎస్సీ కాలనీల్లోకి వరద నీరు ప్రవేశించడం తో పునరావాస కేంద్రాలకు వెళ్లారు. వరదల కారణంగా మొట్ట మొదటిగా వేలేరుపాడు ముంపునకు గురికాగా అన్ని గ్రామాలకు సహాయం అందించిన అధికారులు ఇక్కడ మాత్రం మర్చిపోయారు. ప్రజలు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కొద్ది మొత్తంలో కూరగాయలను పంపించి చేతులు దులుపుకున్నారు. బియ్యం, నూనె, కందిపప్పు కూడా ఇవ్వలేదు. వరద బాధితులకు నగదు పంపిణీ చేయాల్సి ఉండగా అధికారులు 83 కుటుంబాల జాబితాను ఇష్టానుసారం రూపొందిం చడంపై బాధితుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. ఈ కుటుంబాలకు మూడు వేలు చొప్పున పరిహారం అందించే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టగా జాబితాలో పేర్లు లేని బాధితులు పంపిణీని అడ్డుకుని నిరసన తెలిపారు. రాజకీయ ఒత్తిడితోనే జాబితాలో తమ పేర్లు గల్లంతు చేశారంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. దీనిపై తిరిగి మరో జాబితా రూపొందిస్తామని, కలెక్టర్ ఆమోదానికి పంపించి నిధులు మంజూరైతే అందరికి ఇస్తామంటూ అధికారులు చెప్పారు. తమకు ఎప్పుడు పరిహారం ఇస్తారంటూ బాధితులు రెండు రోజులుగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు మొర పెట్టుకుంటున్నా వారి నుంచి ఎలాంటి హామీ లభించలేదు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

రూ.55 లక్షల వసూలు ఎలా ?

- హైకోర్టు న్యాయ నిపుణులతో ఎంపీడీవో చర్చలు.. కలెక్టర్‌కు నివేదించి, పాటదారుడిపై చర్యలు

నరసాపురం, ఆగస్టు 2 : మాధవాయిపాలెం రేవు పాటదారుడు రెడ్డప్ప ధవేజీ బకాయిపడ్డ రూ.55 లక్షలు వసూలు చేసేందుకు అధికారులు శాఖాపరంగా సిద్ధమవుతున్నారు. హైకోర్టులో పంచాయతీ రాజ్‌కు సంబంధించిన ప్రభుత్వ జీపీని శుక్రవారం కలిశారు. న్యాయ పరంగా ఆయన సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ వివరాలన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదించి ఆమె ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో వీరభద్రరావు చెప్పారు. రూ.55 లక్షల బకాయి వసూలుకు ఎనిమిది నోటీసులు ఇచ్చినా ధవేజీ నుంచి సమాధానం లేకపోవడంతో ఎంపీడీవో వెంకటరమణ మానసిక ఒత్తిడికి గురయ్యారు. దీనిపై లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్నారు. మరోవైపు ఆయన మరణానికి సైబర్ నేరగాళ్ల బెదిరింపులు కూడా కారణమనే వాద నలు వినిపించాయి. దీనిపై పోలీసులు లోతైన విచారణ చేస్తున్నారు. కేసు కొలిక్కి రాలేదు. ఇటీవల సమావేశమైన జేఏసీ చర్చించి, బకాయి వసూలుకు న్యాయ నిపుణుల సలహా తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపీడీవో వీరభద్రరావు అమరావతి వెళ్లి పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన హైకోర్టు న్యాయవాదులతో చర్చించి సలహాలు, సూచనలు తీసుకున్నారు. దీనికనుగుణంగా ముందుగా జిల్లా కలెక్టర్ నాగరాణికి వివరాలను నివేదించి, దానికనుగుణంగా చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నారు. ధవేజీ మాత్రం తాను ప్రభుత్వానికి రూ.55 లక్షలు కట్టాల్సిన విషయం వాస్తవమేనని ఒప్పుకున్నారు. తనకు ప్రభుత్వం నుంచి రూ.11 లక్షలు రావాల్సి ఉందని, రూ.50 లక్షలు విలువైన పంటును మండల పరిషత్ అధికారులు స్వాధీనం చేసుకున్నారని ఇటీవల విడుదల చేసిన వీడియోలో వివరించారు. తీరంలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్‌గా మారింది.

గండం గడిచింది..

- తగ్గుముఖం పట్టిన గోదావరి వరద.. ఊపిరి తీసుకుంటున్న ముంపు బాధితులు
- కడెమ్మ స్లూయిజ్ వద్ద తగ్గిన వరద



వేలేరుపాడు-రుద్రమకోట రహదారిపై నిలిచి ఉన్న వరదనీరు

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం, ఆగస్టు 2 : భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గు ముఖం పట్టింది. గురువారం సాయంత్రానికి 41.20 అడుగులున్న నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 34 అడుగులకు చేరుకోవడంతో ముప్పు తప్పింది. నెలరోజులుగా భారీ వర్షాలు, వరదలతో అల్లాడిన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల తీర ప్రాంత ప్రజలకు గండం గడిచింది. వర్షాలు లేకపోవడం, ఎగువ నుంచి వరద లేకపోవడంతో గోదావరి నెమ్మదిగా సాధారణ స్థితికి చేరుకుంది. రహదారులన్ని వరద నీటితో మునిగిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అత్యవసర పనుల నిమిత్తం పడవలపైనే ప్రయాణిస్తూ మండల కేంద్రానికి చేరుకుంటున్నారు. వరదల కారణంగా వాగులపై నిర్మించిన వంతెనలు, అప్రోచ్ రోడ్డులు, ప్రధాన రహదారులు కొట్టకుపోవడంతో వరద తగ్గిన కాలినడకే శరణ్యం. వరదల కారణంగా వేలేరుపాడు, రుద్రమకోట మధ్యగల పెదవాగు బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకు గండి పడటంతో ప్రమాదకరంగా ఉంది. వరద పూర్తిగా తగ్గితే కానీ మరమ్మతులు చేపట్టే అవకాశాలేవు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 8,33,097 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు దిగువన పోలవరం గ్రామ పరిధిలో నీటిమట్టం 22.607 మీటర్లకు చేరుకుంది. కడెమ్మ స్లూయిజ్ వద్ద వరద నీటిమట్టం తగ్గడంతో ఏటిగట్టుకి కుడివైపున ఉన్న కొండవాగుల జలాలు గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి.



పోలవరంలో వరద జలాల నుంచి బయటపడుతున్న పంట పొలాలు

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరు సిటీ : జిల్లాలో వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. గడచిన 24 గంటల్లో అత్యధికంగా వేలేరుపాడు మండలంలో 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కుక్కునూరు 51.2, పోలవరం 5, జంగారెడ్డిగూడెం 4.8, కొయ్యలగూడెం 4.2, జీలుగుమిల్లి 3.6, కామవరపుకోట 3.2, చింతలపూడి 3, లింగపాలెం 2.4, బుట్టాయిగూడెం 2 మి.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగా జిల్లాలోని 10 మండలాల్లోని 79 గ్రామాల్లో వివిధ పంటలు నీటమునిగాయి. వ్యవసాయ శాఖ నివేదికల ప్రకారం 806 హెక్టార్లలో వివిధ పంటలు నీట మునిగాయి. ఇందులో 79 హెక్టార్లలో వరి నారుమళ్లు, 771 హెక్టార్లలో వరి నాట్లు వేసిన పంట పొలాలు నీటమునిగాయి. మూడు హెక్టార్లలో మొక్కజొన్న, 32 హెక్టార్లలో పత్తి పంటలు నీట మునిగాయి. అత్యధికంగా భీమడోలు, ద్వారకా తిరుమల, ఉంగుటూరు, నిడమర్రు, లింగపాలెం, టి.నరసాపురం, జంగారెడ్డి గూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, పోలవరం, వేలేరుపాడు మండలాల్లో పంటలు నీట మునిగాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.



నేటి నుంచి గుబ్బల మంగమ్మ దర్శనం

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలం కోర్సవారిగూడెం పంచాయతీ పరిధిలోని గుబ్బల మంగమ్మను శనివారం నుంచి భక్తులు దర్శించుకోవచ్చని ఆలయ కమిటీ తెలిపింది. ఏజెన్సీలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండ వాగులు పొంగి, అమ్మవారి ఆలయానికి వెళ్ళే రహదారి, మెట్లు, దుకాణాలు కొట్టుకుపోయాయి. వీటి మరమ్మతులు కారణంగా దర్శనాలు నిలిపివేశారు. ఇవి పూర్తి కావడంతో దర్శనాలకు ఏర్పాట్లు చేశారు.



మైపా గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే రహదారితో ఇబ్బందులు

శ్మశానానికి వెళ్లాలంటే నరకమే

నిజంగా నరకం ఎలా ఉంటుందో తెలియదు కానీ మైపా గ్రామంలో ఎవరైనా చనిపోతే వారిని అంత్యక్రియలకు తీసుకువెళ్లేందుకు నరకం కనిపిస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామం నుంచి శ్మశానానికి వెళ్లాలంటే సుమారు కిలోమీటరు వెళ్లాలి.. ఆ కిలోమీటరు మేర ట్రాక్టర్లు తిరగడంతో రోడ్డంతా గోతులు పడి నడిచేందుకు వీలులేకుండా పోయింది. ఈ వర్షాకాలంలో ఎవరు మృతి చెందినా శ్మశానానికి తీసుకెళ్లాలంటే వీరు వణికిపోతున్నారు. సరైన మార్గం లేక మృతదేహాలను తీసుకెళ్లే సమయంలో పడిపోతున్నారని వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ మార్గాన్ని బాగు చేయాలని కోరుతున్నారు.

- పాలకోడేరు



కాళ్ళ మండల పరిషత్ కార్యాలయం వద్ద..

సీసలి రోడ్డు పక్కన స్వాగతం బోర్డు

కాళ్ల రాష్ట్రీయ రహదారి పక్కన

ఇంకా తొలగని బొమ్మలు..రంగులు

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అధికార యంత్రాంగం వైసీపీ పట్ల స్వామి భక్తిని ప్రదర్శిస్తూనే ఉన్నట్టు కనిపిస్తున్నది. కాళ్ళ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన బోర్డులో ఇప్పటికి వైసీపీ అధినేత జగన్, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పీవీఎల్ నరసింహరాజులతో ఉన్న సుస్వాగతం బోర్డు విమర్శలకు తావిస్తున్నది. సీసలి గ్రామంలో రాష్ట్రీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన సుస్వాగతం బోర్డు, జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరిట బోర్డులు, కాళ్ళ శివారులో వైసీపీ రంగులతో కూడిన స్వాగతం బోర్డులు ఇంకా మార్చకపోవడంపై కూటమి ప్రభుత్వ నాయకులు విమర్శలు చేస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష పార్టీలకు సంబంధించిన రంగు కనిపిస్తే చాలు ఆ ఆనవాళ్లే లేకుండా తొలగించారని, ఇప్పుడెందుకు అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. - కాళ్ల

వలలో చిక్కిన కొండ చిలువ



ఉండి మండలం మహదేవపట్నంలో చెరువుకు అడ్డుగా కట్టిన ఒక కొండచిలువ చిక్కుకుంది. దానిని స్థానిక యువకులు పట్టుకుని అటవీ అధికారులకు అప్పగించారు. ఎస్సీ పేటలో వాలీబాల్ ఆడుకునే ప్రాంతంలో వున్న చెరువులోకి బాల్ వెళ్లకుండా వలను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం ఆ.. వలలో చిక్కుకుని వున్న 8 అడుగుల కొండ చిలువను యువకులు చూశారు. దానిని గోనె సంచిలోకి పట్టుకుని పంచాయతీకి తీసుకువచ్చారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. భీమవరం నుంచి అటవీ శాఖ సెక్షన్ అధికారి ఎండీ అబ్దుల్ విచ్చేసి దాన్ని కొల్లేరు-ఉప్పుటేరు పరివాహక ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టారు.

- ఉండి

ఇక్కడే ఉంటే చనిపోతానేమో..

ఇండియా వచ్చేస్తానంటూ కువైట్ నుంచి సెల్ఫీ వీడియో

ఎమ్మెల్యే బాలరాజు దృష్టికి తీసుకువెళ్లిన కుటుంబ సభ్యులు

భారత్‌కు రప్పించేందుకు ఏర్పాట్లు



తాటి సంకురమ్మ

బుట్టాయగూడెం, ఆగస్టు 2 : పొట్టకూటి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి అష్ట కష్టాలు పడుతున్న బుట్టాయగూడెం మండలం మర్లగూడెంకు చెందిన తాటి సంకురమ్మ సెల్ఫీ వీడియో ద్వారా తన బాధలను వివరించింది. అనారోగ్యంతో బాధపడుతున్నానని కొన్ని రోజులు ఇక్కడే ఉంటే చనిపోతానని తనను ఇంటికి తీసుకువెళ్లిపోవాలని ఆ వీడియోలో వేడుకుంది. వీడియో వైరల్ కావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. తాడేపల్లిగూడెం ఏజెంట్‌తో మాట్లాడి బాధితురాలిని ఇండియాకు రప్పించే చర్యలు తీసుకోవాలని లేకుంటే మీపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో ఇండియాకు రప్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆదివారం బాధితురాలు ఇండియాకు బయలుదేరనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.సంకురమ్మ తాడేపల్లిగూడేనికి చెందిన ఏజెంట్ ద్వారా 11 నెలలు క్రితం కువైట్ వెళ్లింది. మొదట్లో ఆమె పనిచేస్తున్న యజమాని ఇంట్లో అంతా బాగానే ఉన్నా తర్వాత కష్టాలు ప్రారంభమయ్యాయి. పది మంది ఉన్న ఇంట్లో ఇద్దరు ముగ్గురు పనిచేయవలసిన చోట ఒక్కరే పని చేయవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. పనిభారం పెరగడమే కాకుండా భోజనం కూడా పెట్టకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఇంటికి వెళ్ళిపోతానంటే కొడుతున్నారని, ఏజెంట్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో ద్వారా రహస్యంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసింది. సంకుమ్మకు 7వ తరగతి చదివే కీర్తి ప్రియ, 4వ తరగతి చదివే క్రాంతికుమార్ ఇద్దరు పిల్లలు.

ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ విదేశాల మోజులోపడి బతుకులు ఛిద్రం చేసుకోవద్దని ఏజెంట్లు మోసాలకు గురికావద్దన్నారు. ఇతర దేశాలకు పనుల కోసం వెళ్లాలనుకునే వారు ఒకటికి, రెండుసార్లు ఆలోచించుకుని నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇంకా ఎవరైనా విదేశాల్లో ఇబ్బందులు పడుతుంటే తన దృష్టికి తీసుకు వస్తే ఇండియాకు రప్పించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

బోధనా సామర్థ్యాలను పెంచుకోవాలి

చదువులో వెనుకబడిన వారికే చివరి పీరియడ్ వినియోగించాలి : డీఈవో

'పది' సిలబస్ తగ్గింపునకు టీచర్ల అభ్యర్థన



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో అబ్రహం

ఏలూరు అర్బన్, ఆగస్టు 2 : కొత్తగా అమల్లోకి వచ్చిన అకడమిక్ కేలండర్ ప్రకారం పాఠశాలల్లో చివరి పీరియడ్‌ను చదువులో వెనుకబడిన విద్యార్థుల(డల్ స్టూడెంట్స్)కు అదనంగా బోధించడం ద్వారా రెమిడియల్ టీచింగ్ కోసం వినియోగించుకోవాలని ఏలూరు జిల్లా డీఈవో అబ్రహం సూచించారు. ఈ ఏడాది నుంచి కొత్త సిలబస్‌తో కూడిన పదో తరగతి పాఠ్య పుస్తకాల్లోని పాఠ్యాంశాలు కఠినంగా వున్న నేపథ్యంలో వాటి బోధనలో మెలకువలను, నమూనా ప్రశ్నాపత్రాలపై అవగాహన నిమిత్తం జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ (డీసీఈబీ) ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో జిల్లాలోని సబ్జెక్టు టీచర్లకు నిర్వహిస్తోన్న పునశ్చరణ తరగతుల రెండోరోజు కార్యక్రమానికి డీఈవో హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గణితం, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో ప్రతీ విద్యార్థి కనీస సామర్థ్యాలను సాధించేలా టీచర్లు బోధనా మెలకువలను పెంపొందించుకోవాలని, టెన్త్ ఉత్తీర్ణత పెంపుకోసమే రాష్టంలోనే తొలిసారిగా సబ్జెక్టు టీచర్లకు జిల్లాలో ఓరియంటేషన్ క్లాసులను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు కనీసం 20 శాతం కూడా హాజరులేని బాలబాలికల ఇళ్ళవద్దకే క్లాసు టీచర్లువెళ్లి తల్లితండ్రులకు కౌన్సెలింగ్ చేసి పిల్లలు రెగ్యులర్‌గా తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్కూలులో ల్యాబ్, లైబ్రరీలను ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా వినియోగించుకోవాల్సిందేనని, ఆటలు కూడా తప్పనిసరిగా ప్రోత్సహించాలన్నారు. ఇకనుంచి తాను పాఠశాలలను నిత్యం సందర్శిస్తానని, ఉపాధ్యాయులు కష్టపడి పనిచేయాలని సూచించారు. డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు మాట్లాడుతూ ఓరియంటేషన్ క్లాసుల్లో సబ్జెక్టు టీచర్ల నుంచి వచ్చిన సూచనలన్నింటినీ క్రోడీకరించి ఎస్‌సీఈఆర్‌టీకి నివేదిస్తామన్నారు. పునశ్చరణ తరగతులు శనివారంతో ముగుస్తాయన్నారు. ఆంగ్ల భాష సబ్జెక్టు రిసోర్స్ పర్సన్లుగా శ్రీనివాసరావు, విల్సన్, రమణి, ప్రాన్సీనా వ్యవహరించారు.

సిలబస్‌ను తగ్గించాల్సిందే : టీచర్ల వినతి

భారీ సిలబస్‌తో, సోషల్ స్టడీస్ వంటి కొన్ని సబ్జెక్టులకు వివిధ విభాగాల్లో వేర్వేరుగా పాఠ్య పుస్తకాలు, కఠినత్వంతో కూడిన ప్రశ్నపత్రాలు తదితర అంశాలతో జటిలంగా వున్న టెన్త్ పాఠ్యపుస్తకాల్లో సిలబస్‌ను తగ్గించాల్సిన ఆవశ్యకత ఉందని ఓరియంటేషన్ క్లాసుల్లో రెండోరోజు కూడా ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యంగా హిందీ, సోషల్, ఆంగ్లం సబ్జెక్టుల్లో సిలబస్‌ను కుదిస్తేనే విద్యార్థులకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఆ మేరకు టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో నమూనా ప్రశ్నాపత్రాలను పరిశీలిస్తే నేరుగా పాఠ్యపుస్తకాల నుంచి కాకుండా అప్లికేటెడ్ ప్రశ్నా విధానాన్ని అనుసరించడం వల్ల ఇవి విద్యార్థులను తికమక పెట్టడం ఖాయమని భావిస్తున్నారు. ఇటువంటివే 60 శాతం ప్రశ్నలు ఉన్నాయని, వీటికి జవాబులను విద్యార్థులు ఆలోచించి రాయాల్సి ఉంటుందే తప్ప పాఠ్యపుస్తకాలను చదివిరాసే పరిస్థితులు లేవని చెబుతున్నారు. ఉపాధ్యాయుల సూచనలను ప్రభుత్వానికి తెలియజేయడానికి జిల్లా విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. అయితే ఓరియంటేషన్ క్లాసుల్లో లేవనెత్తిన అభ్యంతరాలు, టీచర్ల సూచనలను ప్రభుత్వం పరిశీలించి, అమలు చేయాలంటే ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్తే తప్ప ఫలితం ఉండదని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

ఎస్ఎంసీ ఏర్పాటైన పాఠశాలలకే గ్రాంట్లు

తాజా మార్గదర్శకాల్లో ప్రభుత్వం స్పష్టీకరణ

ఏలూరు అర్బన్, ఆగస్టు 2 : ప్రైవేటు పాఠశాలలు మినహా మిగతా ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ పాఠశాలలన్నింటికీ ఎస్ఎంసీల ఎన్నికలు నిర్వహించాల్సిందేనని స్పష్టం చేసింది. ఏ కారణంతోనైనా ఎస్ఎంసీ ఏర్పాటు చేయకపోతే సంబంధిత పాఠశాలకు గ్రాంట్లు విడుదల చేయబోమని హెచ్చరించింది. ఈ నెల 8న జరుగనున్న పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు సంబంధించి విద్యాశాఖ శుక్రవారం మరిన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. రెండేళ్ళ కాలపరిమితితో ఏర్పాటయ్యే ఎస్ఎంసీలో కమిటీ సభ్యుని కుమార్తె/ కుమారుడు పాఠశాలను వీడితే ఆ సభ్యుని పదవీకాలం ఆటోమేటిక్‌గా ముగిసినట్టేనని స్పష్టం చేసింది. సభ్యుల ఎన్నికలను స్కూలు హెచ్ఎం నిర్వహించాలని, కనీసం 50 శాతం మంది తల్లితండ్రులు /సంరక్షకులు హాజరుకావాలని సూచించింది. ఒక తరగతిలో ఎన్ని మీడియంలు, సెక్షన్లు వున్నా అన్నింటినీ ఒకే తరగతిగా పరిగణించాలని అధికారులు సూచించారు. ఎస్ ఎంసీలో ప్రధాన పాత్రదారులు విద్యార్థుల తల్లితండ్రులేనని స్పష్టం చేశారు. పాఠశాల సక్రమంగా నడిచేలా అజమాయిషీ చేయడం, కావలిసిన సదుపాయాలను కల్పిస్తూ, పాఠశాలను అభివృద్ధి చేయడం ఎస్ఎంసీల ప్రధాన బాధ్యత అని అన్నారు. కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను సభ్యులు ఎన్నుకుంటారని, వీరిలో ఒకరు బలహీన వర్గాలకు చెందినవారై ఉండటంతో పాటు, కనీసం ఒక మహిళ ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 1,810 ఎస్ఎంసీలకు ఎన్నికలు నిర్వహించేందుకు సమగ్రశిక్ష జిల్లా కార్యాలయం ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది.

ఏలూరులో వందేభారత్ హాల్ట్‌కు ఎంపీ వినతి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 2: వందేభారత్ రైలు ఏలూరు స్టేషన్‌లో ఆపే విధంగా చర్యలు తీసుకుంటానని రైల్వే ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేవేందర్ కుమార్ తెలిపినట్టు ఏలూరు ఎంపీ మహేష్ యాదవ్ తెలిపారు. ఢిల్లీ రైల్ భవన్‌లో శుక్రవారం దేవేందర్ కుమార్‌ను ఎంపీ కలిశారు. ఈ సందర్భంగా వందేభారత్ రైలును ఏలూరులో నిలుపుదల చేయాలని కోరగా సానుకూలంగా స్పందించిన ఆయన వీలైనంత త్వరలో ఏలూరులో వందేభారత్ రైలును హాల్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

41 మంది సీఐల బదిలీలు

ఏలూరు క్రైం / భీమవరం క్రైం. ఆగస్టు 2 : ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్న సీఐలలో 41 మందిని బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఏలూరు రేంజ్ పరిధిలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో పని చేస్తున్న 41 మందికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే వివిధ కారణాల వల్ల ఇద్దరు సీఐల బదిలీలు నిలిపివేసినట్లు సమాచారం. పోలవరం సీఐగా పనిచేస్తున్న మధుబాబు, గన్నవరం ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న పెద్దిరాజుల బదిలీలను నిలిపివేస్తూ ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. అలాగే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అతి చేసిన కొందరిని ప్రభుత్వం వీఆర్‌కు పంపింది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
ఆర్.అంకబాబు	వీఆర్ కాకినాడ	సామర్లకోట యూపీఎస్
డి.సురేష్	సామర్లకోట యూపీఎస్	(వీఆర్)ఏలూరు రేంజ్
టి.క్రాంతికుమార్	జీలుగుమిల్లి సర్కిల్	పెద్దాపురం సర్కిల్
వై.రవికుమార్	పెద్దాపురం సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
జి.చెన్నకేశవరావు	వీఆర్ ఏలూరు రేంజ్	తుని రూరల్ సర్కిల్
ఎస్‌వీవీఎస్ మూర్తి	తుని రూరల్ సర్కిల్	వీఆర్, ఏలూరు రేంజ్
ఎం.మోహన్‌కుమార్	వీఆర్ ఏలూరు రేంజ్	ముమ్మడివరం సర్కిల్
ఎన్.కొండయ్య	ముమ్మడివరం సర్కిల్	తణుకు టౌన్ పీఎస్
సీహెచ్ విద్యాసాగర్	ఇనగుదురు(కృష్ణా)	రావులపాలెం సర్కిల్
ఎం.రాంకుమార్	రావులపాలెం సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
పి.విశ్వం	దిశా పోలీస్‌స్టేషన్ ఏలూరు	కొవ్వూరు టౌన్ యూపీఎస్
వి.జగదీశ్వరరావు	కొవ్వూరు టౌన్ యూపీఎస్	ఆకివీడు సర్కిల్
సత్యనారాయణ	ఆకివీడు సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
కె.రజనీకుమార్	సీసీఎస్-2 తూర్పుగోదావరి	పాలకొల్లు టౌన్ యూపీఎస్
కె.మంగాదేవి	పాలకొల్లు టౌన్ యూపీఎస్	అలాట్ టు తూర్పుగోదావరి
జి.శ్రీనివాస్	భీమవరం టుటౌన్ పీఎస్	పాలకొల్లు రూరల్ సర్కిల్
కె.సతీష్	పాలకొల్లు రూరల్ సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
బి.యాదగిరి	వీఆర్ ఏలూరు రేంజ్	నర్సాపురం టౌన్ యూపీఎస్
కె.అప్పలస్వామి	నర్సాపురం టౌన్ యూపీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్
జి.కాళిచరణ్	వీఆర్ ఏలూరు రేంజ్	భీమవరం టుటౌన్ పీఎస్
ఎం.నాగరాజు	తణుకు టౌన్ యూపీఎస్	భీమవరం వన్‌టౌన్ పీఎస్
అడబాల శ్రీను	భీమవరం వన్‌టౌన్ పీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్
పి.కృష్ణ	వీఆర్ ఏలూరు రేంజ్	కైకలూరు టౌన్ పీఎస్
ఎన్.వీ నారాయణ	డీపీటీసీ మచిలీపట్నం	గన్నవరం ట్రాఫిక్ -2 పీఎస్
రవికుమార్	గన్నవరం ట్రాఫిక్-2 పీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్
బి.ఎస్.చైతన్యకృష్ణ	కాకినాడ ట్రాఫిక్- 2 పీఎస్	కాకినాడ రూరల్ సర్కిల్
ఎ.శ్రీనివాస్	కాకినాడ రూరల్ సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
బొక్కా పెద్దిరాజు	వీఆర్, ఏలూరు రేంజ్	సర్పవరం పీఎస్
వై.ఆర్.కె.శ్రీనివాస్	సర్పవరం పీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్
జి.మధుబాబు	పోలవరం సర్కిల్	రాజమహేంద్రవరం త్రీటౌన్
వీరయ్యగౌడ్	రాజమహేంద్రవరం త్రీటౌన్	(వీఆర్) ఏలూరు రేంజ్
కె.విజయబాబు	టీసీఎస్-1 రాజమహేంద్రవరం	కొవ్వూరు రూరల్ సర్కిల్
పి.శ్రీనివాసరావు	కొవ్వూరు రూరల్ సర్కిల్	(వీఆర్)ఏలూరు రేంజ్
జె.మురళీకృష్ణ	వీఆర్ ఏలూరు రేంజ్	కంకిపాడు సర్కిల్
వి.శ్రీనివాసరావు	కంకిపాడు సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
టీవీవీ రామారావు	పెనమలూరు యూపీఎస్	ఉయ్యూరు టౌన్ యూపీఎస్
ఎండీ హబీబ్‌బాషా	ఉయ్యూరు టౌన్ యూపీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్
సోమేశ్వరరావు	టీసీఆర్ మచిలీపట్నం	గుడివాడ రూరల్ సర్కిల్
కె.ఏసుబాబు	గుడివాడ రూరల్ సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
వి.పెద్దిరాజు	గన్నవరం ట్రాఫిక్-1 యూపీఎస్	గుడివాడ టుటౌన్ పీఎస్
ఎం.నాగదుర్గారావు	గుడివాడ టుటౌన్ పీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్

క్రైం కార్నర్

వ్యాపారంలో నష్టాలు.. ఆత్మహత్య



ఏలూరు క్రైం, ఆగస్టు 2 : వ్యాపారంలో నష్టాలు, కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు ఏకేజీ సెంటర్‌కు చెందిన తలపాకల భాస్కరరావుకు (45) భార్య ఇద్దరు పిల్లలున్నారు. సోఫాల వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు, కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో వంటగదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న టుటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

చింతలపూడి, ఆగస్టు 2: చింతలపూడి మండలం సీతానగరం గ్రామానికి చెందిన కనుమూరి మల్లాచారి (30)తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. సంఘటనా స్థలాన్ని ఎస్సై కుటుంబరావు పరిశీలించారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, అప్పులు చేసి తీర్చలేక ఉరి వేసుకుని మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి తరలించినట్లు చెప్పారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని ఒకరి మృతి

భీమడోలు, ఆగస్టు 2 : భీమడోలు మండలం పూళ్ల శివారు వసంత కాలనీ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం మునిపల్లి గ్రామానికి చెందిన మిద్దే వెంకటేశ్వరరావు (37) హనుమాన్ జంక్షన్‌లోని ఒక కంపెనీలో ఫిట్టర్‌గా పని చేస్తుంటాడు. గురువారం మునిపల్లికి ద్విచక్రంపై వస్తుండగా పూళ్ల శివారు రోడ్డు పక్కన ఆపి ఉన్న కంటెయినర్ లారీని ఢీకొట్టడంతో మృతిచెందాడు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



పోలవరం, ఆగస్టు 2 : రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలపాలైన సంఘటన పోలవరం మండలంలో శుక్రవారం జరిగింది. పోలవరం పంచాయతీ వడ్డీలపేట ప్రాంతానికి చెందిన ముగ్గురు మత్స్య కారులు పోలవరం నుంచి తహసీల్దారు కార్యాలయానికి తమ బైక్‌పై వెళుతూ స్థానిక కొండ కాలువల ఇరుకు వంతెనపై నుంచి వస్తున్న స్కూలు బస్సుని తప్పించే క్రమంలో బైకుతో సహా కాలువలో పడిపోయారు. దీంతో బైకుపై ఉన్న పంతుల రామకృష్ణ, నగేరు సుబ్రహ్మణ్యం, గోపల రామకృష్ణ లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వారికి ప్రథమ చికిత్స అందించారు. తీవ్ర గాయాలపాలై కాళ్ళు విరిగిన సుబ్రహ్మణ్యం, గోపల రామకృష్ణలను రాజమహేంద్ర వరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



గాయాలపాలైన డ్రైవర్ సాయి

జీలుగుమిల్లి వద్ద రోడ్డు ప్రమాదం..డ్రైవర్‌కు గాయాలు

జీలుగుమిల్లి, ఆగస్టు 2 : జీలుగుమిల్లి సమీప జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలై ఆస్పత్రి పాలయ్యాడు. దర్భగూడెంకు చెందిన ఒక రైతు వద్ద కుక్కునూరు మండలం దాచారంకు చెందిన సాయి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ట్రాక్టరు వెళుతుండగా గ్యాస్ గొడౌన్ సమీపంలో ఆగి ఉన్న లారీని ట్రాక్టరు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సాయి తలకు తీవ్ర గాయమైంది. జీలుగుమిల్లి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బాకీ కట్టమన్నందుకు మహిళతో అసభ్య ప్రవర్తన

ద్వారకాతిరుమల, ఆగస్టు 2: మధ్యవర్తిగా ఉండి డబ్బులు ఇప్పించినందుకు బాకీ కట్టమని అడిగిందన్న అక్కసుతో ఆమె ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి దుర్భాషలాడటమే కాకుండా అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ద్వారకాతిరుమల పోలీసులు తెలిపారు. మండలంలోని ఐఎస్ రాఘవాపురానికి చెందిన షేక్ అహమ్మద్ ఉన్నీషా అనే మహిళ బుట్టాయిగూడెం మండలం దొరమామిడికి చెందిన షేక్ బారిమామ్‌కు తనకు తెలిసిన వ్యక్తి వద్ద నుంచి రూ.6 లక్షలు అప్పుగా ఇప్పించింది. కొంత కాలం తర్వాత బాకీ అతనికి చెల్లించమని అడిగింది. దీంతో బారిమామ్ ఈనెల 1న ఉదయం 11 గంటలకు ఉన్నీషా ఇంటికి వెళ్లి నన్నే బాకీ కట్టమంటావా చంపుతా అంటూ బెదిరించి బూతులు తిడుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై శుక్రవారం బాధితురాలిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

ఉండిలో పేకాట స్థావరంపై దాడి

ఉండి ఆగష్టు 2:ఉండిలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఉండి చిక్కాల వీరన్ననగర్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.3430 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

ద్వారకాతిరుమలలో రెండు కాసుల బంగారం అపహరణ

ద్వారకాతిరుమల, ఆగస్టు 2: వైద్యం చేయించుకునేందుకు నెలక్రితం హైదరాబాద్ వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారని ద్వారకాతిరుమలకు చెందిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామానికి చెందిన కొయ్యగూర శ్రీవల్లి గత నెల 2న వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లింది. ఈనెల 2న ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపుల తాళం పగులకొట్టి ఉంది. దీంతో లోపలకు వెళ్లి చూడగా బీరువా తలుపులు పగుల కొట్టి రెండు కాసుల బంగారు వస్తువులు తస్కరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

సిద్ధాపురంలో పెద్దింటి అమ్మవారి హుండీ చోరీ

ఆకివీడు రూరల్ ఆగస్టు 2 : ఆకివీడు మండలం సిద్ధాపురం కురుపాక వంతెన సమీపంలోని పెద్దింటి అమ్మవారి ఆలయం వద్ద హుండీ చోరీకి గురైంది. సిద్ధాపురంలోని జడ్పీ పాఠశాల ఆవరణలో శుక్రవారం హుండీని గుర్తించిన విద్యార్థులు ఉపాధ్యాయులు, స్థానికులకు తెలియజేశారు. హుండీ పెద్దింటి అమ్మవారి ఆలయానికి చెందినదిగా స్థానికులు గుర్తించారు. సుమారు రూ.10 వేలు నగదు చోరీకి గురై ఉంటుందని స్థానికులు తెలియజేస్తున్నారు. ఇటీవల కాలంలో ఆకివీడు, చుట్టుపక్కల ప్రాంతాలలో చోరీలు పెరిగిపోయాయని ప్రజలు వాపోతున్నారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం



లింగపాలెం, ఆగస్టు 2 : ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన గోగుంట విజయ్‌కుమార్ కనిపించడం లేదంటూ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై రాంబాబు తెలిపారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన గోగుంట విజయ్‌కుమార్ మతిస్థిమితం లేక ఇంటి నుంచి వెళ్ళిపోయినట్లు తెలిపారు. గతంలో విజయవాడలో మందులు వాడుతున్నామని, గతనెల 28వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్ళి రాక పోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్ళదగ్గర వెతికినట్లు తెలిపారు. ఎక్కడా కనిపించక పోవడంతో శుక్రవారం కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

టి.నరసాపురం, ఆగస్టు 2: మద్యానికి బానిసై భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు టి.నరసాపురం ఎస్సై దుర్గామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. టి.నరసాపురం మండలంలోని రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన పసుపులేటి పుష్పరాజ్యం, భర్త ప్రసాద్‌కు 25 ఏళ్ళక్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన ప్రసాద్ రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యని వేధిస్తూ కొడుతుండేవాడని ఈ క్రమంలో గత జూన్ 5న అతిగా మద్యం సేవించి వచ్చి భార్యను కొట్టి ఇంటినుంచి గెంటేశాడని దీంతో పుష్పరాజ్యం గ్రామ పెద్దలను ఆశ్రయించింది. పెద్దలు హెచ్చరించినా ప్రసాద్ భార్యను ఇంటికి రానివ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



నూజివీడు ట్రిపుల్ ఐటీని సందర్శించినఎన్ఎస్ఐసీ అధికారులు

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు జాబ్ స్కిల్స్‌పై శిక్షణ

నూజివీడుటౌన్, ఆగస్టు 2:ఇంజనీరింగ్ విద్యార్థులు పరిశ్రమల్లో ఉద్యోగాలు చేసేందుకు అవసరమైన నైపుణ్యంపై శిక్షణ ఇస్తామని నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఐసీ) అధికారులు అన్నారు. ఎన్ఎస్ఐసీ హైదరాబాద్‌కు చెందిన జీఎం సుబ్రమణి, డిప్యూటీ మేనేజర్ టి.ముత్తు కుమారన్, డిప్యూటీ మేనేజర్ అబ్దుల్ ఖాదర్ నూజివీడు ట్రిపుల్ ఐటీని సందర్శించి క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్‌తో పాటు పలు విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం సహకారంతో సూక్ష్మ పరిశ్రమల స్థాపన ఎలా చేయాలి అనే అంశాలపై చర్చించారు. అకడమిక్ డీన్ రత్నాకర్, అసోసియేట్ డీన్ డాక్టర్ జ్యోతిలాల్ నాయక్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శ్రావణి, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



పోటీల వివరాలతో ఉన్న బ్రోచర్

పోలీసు షార్ట్ ఫిలిం కాంటెస్ట్‌కు ఆహ్వానం

ఏలూరు క్రైం, ఆగస్టు 2 : మహిళలు, బాలబాలికల రక్షణ, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించే విధంగా షార్ట్ ఫిలిం పోటీని నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. షార్ట్ ఫిలిం ఒక నిమిషం నుంచి రెండు నిమిషాల నిడివితో ఉండాలి. దీనిని రూపొందించి ఈ నెల 13వ తేదీలోపు జిల్లా అధికారుల సెల్‌ఫోన్ నెంబరు 99488 90429కు పంపాలని సూచించారు. అధికారులు పరిశీలించి మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు ఆగస్టు 15వ తేదీన అందిస్తారన్నారు. ఉత్సాహవంతులైన విద్యార్థిని విద్యార్థులు, ప్రజలు ఈ కాంటెస్ట్‌లో పాల్గొని తమ ఆలోచనలకు పదునుపెట్టి బహుమతులు పొందాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

వరి నారుకు డిమాండ్

సెంటు నారు రూ.1000 నుంచి రూ. 1500పైనే



ఉండి ప్రాంతానికి వ్యాన్‌లో వరి నారు రవాణా

ముదినేపల్లి, ఆగస్టు 2 : సార్వా వరి నారుకు డిమాండ్ ఏర్పడింది. వర్షాలకు వెదజల్లిన వరి ముంపునకు గురై ముదినేపల్లి మండలంతో పాటు పరిసర మండలాలు, ఇతర జిల్లాల్లో కూడాఆ వందలాది ఎకరాల్లో దెబ్బ తినడంతో తిరిగి నాట్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరి సాగు ఎక్కువగా ముదినేపల్లి మండలంలోనే జరుగుతున్నందున నారు కొనుగోలుకు పశ్చిమ గోదావరి జిల్లా ఉండి, ఆకివీడు, కాళ్ల మండలాల నుంచి కృష్ణా జిల్లా పెడన, బంటుమిల్లి తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, కౌలు రైతులు వరి నారు కోసం వస్తున్నారు. దీంతో ముదినేపల్లి ప్రాంతంలో వరి నారుకు డిమాండ్ పెరిగింది. డిమాండ్‌తో పాటు ధర కూడా పెరిగింది. సెంటు వరి నారు రూ.1000 నుంచి రూ.1500 వరకు ఇతర జిల్లాల రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువగా ఉండి ప్రాంత రైతులు వర్షాల వల్ల నారుమళ్లు కూడా దెబ్బతినటంతో ఆ ప్రాంతం నుంచే ఎక్కువ మంది రైతులు వరి నారుకు వస్తున్నారు. సెంటు నారు కొనుగోలు, నారు తీత, రవాణా ఖర్చులు కలిపి ఇతర మండలాలకు చేరేటప్పటికీ రూ.2200 అవుతున్నది. వర్షాలకు ముదినేపల్లి ప్రాంతంలో కూడా వెదజల్లిన వరి పైరు దెబ్బ తినటంతో స్థానిక రైతులు కూడా నారు కొనుగోలు చేస్తుండటంతో మరింత డిమాండ్ పెరిగింది.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు సిటీ, ఆగస్టు 2: ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కె వెట్రి సెల్వి ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార విధానం, వరదల అనంతరం చేపట్టవలసిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం కలెక్టర్ సమీక్షించారు. సానుకూలంగా పరిష్కరించే అవకాశం ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. వరద అనంతరం తీసుకోవాల్సిన పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీరు సరఫరా చేయాలన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పేరుకుపోయిన బురద, డ్రెయిన్లలో పూడిక తొలగించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ పి.ధాత్రి రెడ్డి, ఏఎస్పీ స్వరూపరాణి, జడ్పీ సీఈవో సుబ్బారావు, అధికారులు పాల్గొన్నారు.

పోలీస్, హోంగార్డుల సమస్యలపై దృష్టి : ఎస్పీ


సమస్యలను పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, ఆగస్టు 2 : జిల్లాలో పోలీసు సిబ్బంది ఏఆర్, సివిల్, హోంగార్డు సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు చేపట్టామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమ దివస్‌ను పురస్కరించుకుని సిబ్బంది సమస్యలపై శుక్రవారం వినతులు స్వీకరించారు. విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారి సమస్యలు పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసు ప్రధాన కార్యాలయ ఉద్యోగి సాల్మన్, పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ఏలూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ కేపీఎస్ కిశోర్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. మోటారు సైకిల్‌పై నగరంలోని ప్రధాన వీధులను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యను స్వయంగా చూశారు. ఫైర్‌స్టేషన్, ఆసుపత్రి, ఆర్ఆర్‌పేట, పవరుపేట, పాతబస్టాండ్, ఆదివారపుపేట, కంద్రికగూడెం, తంగెళ్లమూడి, అల్లూరి సీతారామరాజు స్టేడియం, ఏలూరు కొత్తబస్టాండ్, శాంతినగర్, ఏలూరు వన్‌టౌన్ రోడ్లను పరిశీలించారు. ఎస్పీతో పాటుగా ఏలూరు డిప్యూటీ ఇంజనీరు తాతబాబు, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచి ఇనస్పెక్టర్ ఆదిప్రసాద్‌లు ఉన్నారు.

అవసరమైన వారు న్యాయ సాయం పొందవచ్చు


ఆహార పదార్థాలు రుచి చూస్తున్న జడ్జి

ఏలూరు క్రైం, ఆగస్టు 2: రిమాండ్ ఖైదీలకు సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.రత్నప్రసాద్ అన్నారు. ఏలూరులోని జిల్లా జైలును జడ్జి రత్నప్రసాద్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సెప్టెంబరు 14న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఆహార పదార్థాలను రుచి చూశారు. జైలు సూపరింటెండెంట్ ఆర్‌వీస్వామి, జైలర్‌లు పాల్గొన్నారు.

ఐటీఐలో వసతులు కల్పించాలని ఆందోళన



విప్పలపాడు ఐటిఐ వద్ద విద్యార్థుల ఆందోళన

బుట్టాయగూడెం, ఆగస్టు 2: విప్పలపాడు ప్రభుత్వ ఐటీఐలో వసతులు కల్పించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం ఆందోళన చేశారు. జిల్లా కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ కళాశాలలో అధ్యాపకుల కొరత ఉందన్నారు. వసతిగృహం లేకపోవడంతో దూరప్రాంత విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలేజీలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రహరీ గోడను ఏర్పాటు చేయాలని, వసతిగృహాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిరాజు, శ్రీను విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి


పింగళి జయంతి కార్యక్రమంలో అధికారులు

దెందులూరు, ఆగస్టు 2: జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య యువతకు ఆదర్శమని ఎంపీడీవో శ్రీలత అన్నారు. సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ నర్సింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి నిర్వహించారు. జాతీయ జెండాలను ప్రదర్శించారు. నర్సింగ్ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

● ఏలూరు రూరల్: జాతీయపతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి ఘంటసాల స్వరపీఠం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. మానవత కేంద్ర కమిటీ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్, మానవత సంస్థ సహాయంతో కుట్టుమిషన్లు ప్రారంభించారు. తొలుత పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. జాతీయ పతాకాలను తయారుచేసి పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాలకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు సుభానీ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవినేని భాస్కర్‌రావు, నాగేశ్వరరావు, దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎం.శ్రీవల్లీ, ఘంటసాల యశ్విని, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌పై ప్రభుత్వం స్పష్టతనివ్వాలి : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 2: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, సూపర్‌సిక్స్ అమలుపై స్పష్టత ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం డిమాండ్ చేశారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో సీపీఎం జిల్లా సమావేశం పి.కిశోర్, ఎం.నాగమణి, ఎం.జీవరత్నం అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సీతారాం మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలను ప్రజలే ఓడించారన్నారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ జిల్లాలో రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ బకాయిలు రూ.110 కోట్లు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు డీఎన్‌వీడీ.ప్రసాద్, జి.రాజు, తెల్లం రామకృష్ణ, ఆర్.లింగరాజు, పి.సూర్యారావు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలసిన మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

ఏలూరు క్రైం, ఆగస్టు 2 : దెందులూరు నియోజకవర్గంలో శాంతి భద్రతలను కాపాడాలని, ప్రజలకు రక్షణ కల్పించాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్‌ను కోరామని మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి చెప్పారు. శుక్రవారం ఎస్పీని కలసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో రాజకీయ దురుద్దేశంతో ప్రశాంత వాతావరణాన్ని సమస్యాత్మకంగా సృష్టించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధికి కృషి చేయాలని అబ్బయ్య చౌదరి కోరారు. తాము ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడబోమన్నారు.

ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోనేరు


అధ్యక్షుడిని సత్కరిస్తున్న న్యాయవాదులు

ఏలూరు క్రైం, ఆగస్టు 2 : ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనేరు సీతా రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీతారాంను పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. జిల్లా కోర్టు గవర్నమెంట్ ప్లీడరు బీజేరెడ్డి, ఏపీపీలు ఆచంట వెంకటేశ్వరావు, బీవీ రామాంజనేయులు, సీహెచ్ రాజేంద్రప్రసాద్, మహిళా న్యాయవాదులు మాధవి, సంధ్యారాణి, సునీత, అనిత, న్యాయవాదులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పదవికి శుక్రవారం ఎన్నిక నిర్వహించారు. నేముల రాముడు, జి.శ్రీనివాసరావు పోటీలో ఉన్నారు. 254 మంది ఓటు హక్కును వినియోగించుకోగా నేముల రాముడికి 148 ఓట్లు, శ్రీనివాసరావుకు 106 ఓట్లు లభించాయి. 42 ఓట్ల మెజార్టీతో నేముల రాములు గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. మిగిలిన పదవులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గతంలోనే ప్రకటించారు. 7న నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేయనున్నారు.





జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, ఉంగుటూరు, పోలవరంలో తల్లి పాల ప్రయోజనాలపై అవగాహన ర్యాలీ, పోషకాహారం ఆవశ్యకత సదస్సులో ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బంది

బిడ్డకు తల్లి పాలు శ్రేష్ఠం

గ్రామాల్లో ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీల ర్యాలీ


టి.నరసాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది


పోలసానపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

పోలవరం, ఆగస్టు 2: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో శుక్రవారం తల్లి పాల వారోత్సవవాలు నిర్వహించారు. నవజాత శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలు సంజీవని అని అంగన్వాడీ వర్కర్ పీఎల్ఎస్ కుమారి అన్నారు. వెంకటరెడ్డిగూడెం, జగన్నాధపేట 2, ఇటుకల కోట, పాతపోలవరం అంగన్వాడీ సెంటర్లలో గర్భిణులు, బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు.

● దెందులూరు: పిల్లలకు తప్పనిసరిగా పిల్లలకు తల్లిపాలే ఇవ్వాలని దెందులూరు అంగన్వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ అన్నారు. ఆరోగ్యశాఖ, అంగన్వాడీ సంయుక్త తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ చిట్టెమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పూర్తి భోజనం, పాలు, గుడ్లు, వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి తల్లి బిడ్డకు తల్లి పాలనే ఇచ్చేవిధంగా అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నామన్నారు. అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, బాలింతలు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: బిడ్డపుట్టిన గంటలోపే తల్లి ముర్రి పాలు పట్టించాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెంటెంట్ వి.రాంబాబు సూచించారు. తల్లి పాల వారోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం-75లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.లక్ష్మి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది. డాక్టర్ రాంబాబు గర్భిణీ, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణీ, బాలింతలతో అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కె.జగదీశ్వరి, మెడికల్ కౌన్సిలర్లు జె.మోహన్, అంబేడ్కర్, ఏఎన్ఎం మణి, అంగన్‌వాడీలు వరలక్ష్మి, శాంతి, దుర్గాదేవి, ఆశ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

● పెదపాడు: బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టించాలని, పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ పీవో కె.విజయలక్ష్మి తెలిపారు. వేంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సర్పంచ్ రెడ్డియ్య, పారా లీగల్ కౌన్సిలర్ కృష్ణవేణి, సూపర్‌వైజర్ కె.కుమారి, సెక్టారు అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: మండలంలోని కొమ్ముగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. పిల్లలకు అనుబంధ పోషకాహారం తయారుచేసి ప్రదర్శించినట్లు తెలిపారు. తల్లులకు, గర్భిణులకు, కిషోర బాలికలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. సూపర్‌వైజర్ కె.రూన్సీ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని తెలిపారు.

● టినరసాపురం: పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి అన్నారు. కేతవరం అంగన్‌వాడీ కేంద్రం -1లో తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బిడ్డపుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించటం ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. సర్పంచ్ టి.శివమాధవి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: బిడ్డకు 6 నెలల వరకు తల్లి పాలు ఇవ్వడం వల్ల తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో తులసి అన్నారు. తల్లి పాల విశిష్టతపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహదేవమ్మ, కార్యకర్తలు లక్ష్మీదేవి, సుందరి, జాన్సీ, ఎఎన్ఎంలు, ఆశాలు బాలింతలు ఉన్నారు.

● కామవరపుకోట: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల ఆవశ్యకతను తెలియచేస్తూ అంగన్‌వాడీ కేంద్రాల వద్ద గర్భిణులు, బాలింతలకు సూచనలు ఇచ్చారు. రావికంపాడు, కొండగూడెం తదితర గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు సూపర్‌వైజర్ బీవీఎల్.మంగాదేవి, వీర కుమారి తెలిపారు. హెచ్‌వీసరోజిని, ప్రసన్నకుమార్, గణేశ్, ఆశా వర్కర్లు ఉన్నారు.

● ఉంగుటూరు: అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆశాలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ వర్కర్ యండ్రపాటి సుజాత తల్లిపాల ప్రయోజనాలు వివరించారు.

● భీమడోలు: తల్లి పాలు అమృత తుల్యమని ఐసీడీఎస్ పీవో విజయ లక్ష్మి అన్నారు. పోలసానపల్లిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. బేగం, రాణి కుమారి, ఏ.ఎన్ఎం జ్యోతి పాల్గొన్నారు.

● చింతలపూడి: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని శెట్టివారిగూడెం అంగన్‌వాడీ సెంటర్లో తల్లిపాల వారోత్సవాలు సూపర్‌వైజర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో జరిగాయి. పిల్లలకు అన్నప్రాసన్న కార్యక్రమం కూడా నిర్వహించారు. ఏఎన్ఎం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఎం.జ్యోతి, చెన్నకేశ్వరి పాల్గొన్నారు.

● లింగపాలెం: తల్లిపాలు బిడ్డలకు ఎంతో ఆరోగ్యకరమని డాక్టర్ యాని ప్రీతి అన్నారు. ధర్మాజిగూడెం పీహెచ్‌సీ పరిధిలోని బోగోలు అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ పద్మజ, ఎంఎల్‌హెచ్‌వి మంజీర, ఏఎన్ఎం భవాని, అంగన్‌వాడీ వర్కర్ విమల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం: ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఏలూరు తాపీమేస్త్రి కాలనీ వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టరు కిరణ్మయి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యదాయకమన్నారు. సీడీపీవో పద్మావతి మాట్లాడుతూ ముర్రిపాలలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయని, రోగాలను ఎదుర్కొనే శక్తిని పెంచే గుణం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంగ, ఆశా, అంగన్‌వాడీ, గర్భిణీ, బాలింతలు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: గొల్లాయిగూడెం బాపిస్ట్‌పేటలో గర్భవతులకు తల్లి పాలపై ఐసీడీఎస్ పీడీ పద్మావతి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ నవ్య, మీనాక్షి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎల్‌ఎడ్ పరీక్ష ఫలితాలు విడుదల

ఏలూరు అర్బన్, ఆగస్టు 2: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జూన్‌లో నిర్వహించిన డీఎల్‌ఎడ్ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయని డీఈవో అబ్రహం తెలిపారు. ఉత్తీర్ణత సర్టిఫికెట్లను bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. నిర్దీత ఫీజు చెల్లించి రీ-కౌంటింగ్‌కు ఈ నెల పదోతేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

జ్ఞానేశ్వరికి గుప్తా ఫౌండేషన్ రూ.లక్ష విరాళం


రూ.లక్ష చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 2: కాలేయవ్యాధితో బాధపడుతున్న జ్ఞానేశ్వరికి వైద్య ఖర్చుల నిమిత్తం గుప్తా ఫౌండేషన్ ట్రస్ట్ రూ.లక్ష విరాళం ఇచ్చింది. ట్రస్ట్ కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి ద్వారా రూ.లక్ష చెక్కును బంధువులకు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కె.జ్ఞానేశ్వరికి వైద్య ఖర్చులకు రూ.10వేలు, బీకాం విద్యను ఫైనలియర్‌లో నిలిపివేసిన పెదవేగి మండలం ఎం.వెంకటేశ్వరరావు చదువు కొనసాగించేందుకు ఫీజు నిమిత్తం రూ.10వేలను శ్రీసాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు, డీఈవో అబ్రహం అందజేశారు. జి.ప్రకాష్, పి.వెంకటరమణ, జి.కృష్ణ, సీహెచ్.శ్రీధర్, జి.శ్రీనివాసరావు, జి.మోహన్, ఏ.త్రినాథరాజు పాల్గొన్నారు.

సివిల్స్ పరీక్షార్థులకు ఫ్యూచర్ ఇండియా శిక్షణ

ఏలూరు అర్బన్, ఆగస్టు 2: సివిల్స్ పరీక్షార్థులకోసం ప్రిలిమ్స్, మెయిన్స్ ప్రోగ్రాంలలో అత్యుత్తమ కోచింగ్ ప్రోగ్రాంను అందుబాటులోకి తెచ్చినట్టు ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సతీష్ సావిత్రి సరెళ్ళ శుక్రవారం తెలిపారు. రూ2వేల నిర్వహణ రుసుంతో చేరవచ్చునన్నారు. ఢిల్లీస్థాయి ఫ్యాకల్టీతో శిక్షణ, స్టడీ మెటీరియల్, రోజువారీ, వారాంతపు, నెలవారీ, సబ్జెక్టు టెస్టులు, పుస్తకాలు శిక్షణలో భాగంగా అందజేస్తామన్నారు. సివిల్స్ పరీక్షార్థులు ఏలూరు సీఎస్ఐ కాంపౌండ్‌లోని ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ అకాడమీలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, వివరాలకు ఫోన్ నెంబర్లు 81439 74622, 89771 54622లో సంప్రదించాలని కోరారు.

నేత్రపర్వం...శివ కల్యాణం


శివకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 2: శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన శివ దేవుని కల్యాణం శుక్రవారం నేతపర్వంగా సాగింది. ఆలయ ముఖ మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా, పార్వతీ సమేత శివయ్య కల్యాణ మూర్తులను ఉంచి కల్యాణం నిర్వహించారు. శుభముహూర్త సమయంలో మాంగల్య ధారణ, తలంబ్రాలు మేళతాళాలు, డోలు, సన్నాయి వాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు.

సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ హర్షం


హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

కామవరపుకోట, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ సుప్రీం తీర్పు ఇవ్వడంపై ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బారతాల రమేష్ మాదిగ హర్షం వ్యక్తం చేశారు. వర్గీకరణకు సహకరించిన ప్రధాని మోడీకి, 30 సంవత్సరాలుగా పోరాటం కొనసాగిస్తున్న ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు, బిజెపి నాయకులు కాకి చంటి తదితరులు ఉన్నారు.

సుప్రీం తీర్పు చారిత్రాత్మకం

ఏలూరు టూటౌన్, ఆగస్టు 2: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీం తీర్పు చారిత్రాత్మకమని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మున్నుల గురునాథ్ జాన్ అన్నారు. ఎస్సీలను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా వర్గీకరిస్తే 59 ఉప కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఎస్సీ వర్గీకరణ వలన ప్రతీ ఉపకులానికి తగు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసి ఎస్సీవర్గీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఊపిరి పోసింది చంద్రబాబు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 2: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణకు ఊపిరి పోసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందని మండవ లక్ష్మణరావు, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గొల్లమండల శ్రీనివాసరావు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుతో ఎంతోమంది మాదిగ ఉప కులాలకు చెందిన వారికి మేలు చేకూరుతుందన్నారు. ఆనాడు నారా చంద్ర బాబు నాయుడు తీసుకున్న చొరవ వల్లనే నేడు వర్గీకరణ సాధ్యమైందన్నారు. గొల్లమండల శ్రీనివాసరావు మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా నేడు సుప్రీంకోర్టు తీర్పునివ్వడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. టీడీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎడ్లపల్లి కొండ, టిడిపి,ఏపి ఎంఆర్‌పిఎస్ నాయకుడు లాగు ప్రకాష్ తదితరులున్నారు.

సుప్రీంకోర్టు తీర్పుతో సంబరాలు


పొంగుటూరులో ఎంఆర్‌పీఎస్ సంబరాలు

కొయ్యలగూడెం, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఎంఆర్‌పీఎస్ నాయకులు సంబరాలు చేశారు. పొంగుటూరు, కన్నాపురం గ్రామాల్లో కేకులు కట్ చేసి మిఠాయిలు పంచారు. ఎస్సీలోని అణగారిన కులాలకు న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. కన్నాపురం గ్రామంలో ఎస్సీసెల్ అధ్యక్షుడు చాపల విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు గంట్లయ్య, షేక్ బాజీ, పొంగుటూరు గ్రామంలో రమేష్ సత్యనారాయణ, కోడవటి రామకృష్ణ, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.


రామశింగవరంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పేదవాని సొంతింటి కల నిజం చేస్తాం : చింతమనేని

పెదవేగి, ఆగస్టు 2: పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ప్రభాకర్ అన్నారు. మీ కోసం మీ చింతమనేని కార్యక్రమంలో భాగంగా రామశింగవరం, కూచింపూడి, న్యాయంపల్లి గ్రామాల్లో శుక్రవారం చింతమనేని పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల విన్నపాల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గ్రామాల్లో మూడు సెంట్ల ఇంటిస్థలం అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకున్నారని ఆయన తెలిపారు. జగన్ అండ్‌కో దోచుకున్న ప్రభుత్వ సొమ్మును తిరిగి ఖజానాకు చేరేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దారు భ్రమరాంబ, రామశింగవరం సర్పంచ్ అడపా శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు గుర్రం మాధవ, పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, రామానుజం వెంకటేశ్వరరావు, గిత్తా సత్యనారాయణ, ఉండవల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయిస్తా : ఎమ్మెల్యే బాలరాజు


దీక్ష విరమింప చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం, ఆగస్టు 2: దళారుల చేతిలో నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చేస్తానని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హామీ ఇచ్చారు. గవరవరంలో 3రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్న రైతులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి దళారుల నుంచి సొమ్మును రికవరి చేయిస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతులు దీక్ష విరమింప చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

టి.నరసాపురం, ఆగస్టు 2: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. మక్కినవారిగూడెంలో ఎన్డీఏ కూటమి విజయోత్సవ ఆత్మీయ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పలు అంశాలపై చర్చించారు. జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. పాఠశాల స్థలం ఆక్రమణకు గురైందని, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళడంతో ఆక్రమణలు తొలగింపుకు చర్యలు చేపడతామన్నారు. అడపా నాగరాజు, ఆచంట సూర్యనారాయణ, పిన్నమనేని మధు పాల్గొన్నారు.




ఉంగుటూరు భద్రకాళి అమ్మవారికి సారె సమర్పించిన మహిళలు, ఏలూరులో శాకంబరిగా కనకదుర్గ, అంబికాదేవికి ఆషాఢ సారె

అమ్మవార్లకు ఆషాఢ సారె

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 2: సత్రంపాడు అంబికాదేవికి భక్తులు ఆషాఢం సారె సమర్పించారు. మేళతాళాలు, బాజాభజంత్రీలతో శుక్రవారం ప్రదర్శనగా ఆలయానికి చేరుకున్నారు. పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, పండ్లు, పదార్థాలు తదితర రకాలను అమ్మవారికి సమర్పించారు. అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో పూజలు చేయించారు. కోలాట నృత్యాల ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలిరావడంతో ఆలయ ప్రాంతం అంబికాదేవి నామస్మరణతో మార్మోగింది.

● ఉంగుటూరు: ఉంగుటూరు భద్రకాళి అమ్మవారికి తాడేపల్లిగూడెం కాకతీయ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆషాఢ సారె సమర్పించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సేవా సమితి సభ్యులు చల్లాలమ్మ, కనకదుర్గ, జాలమ్మ, కొండాలమ్మకు కూడా సారె సమర్పించారు. సమితి సభ్యులు భీమేశ్వరస్వామి ఆలయ ఈవో కలగర శ్రీనివాస్, పాతూరి విజయకుమార్, గొడితి వెంకటేశ్వరరావు, శరణాల మాలతీరాణి, కొండ్రెడ్డి శశి కుమార్, సర్వేశ్వరరావు, కడియాల పరశురాం, కోరా నారాయణమూర్తి, పుట్టా రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు సాయి గాయత్రి ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు స్వీట్లు సమర్పించారు.

● ఏలూరు కార్పొరేషన్: పన్నెండు పంపుల సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పూజలు చేశారు.

● పెదపాడు: తోటగూడెంలో పెద్దసంఖ్యలో మహిళలు గంగానమ్మకు ఆషాఢ సారె సమర్పించి మొక్కులు తీర్చుకుని శుక్రవారం పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి సారె, పసుపు, కుంకుమ కలిపి నీళ్లతో నిండిన బిందెలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

5 నుంచి శ్రావణ మాసోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్: సత్రంపాడులోని అంబికాదేవి ఆలయం వద్ద ఈ నెల 5 నుంచి సెప్టెంబర్ 2 వరకు శ్రావణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అర్చకుడు వారణాసి రాఘవేంద్రశర్మ, అంబికా సంస్థల అధినేత అంబికా ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో శ్రావణ మాసోత్సవాల బ్రోచర్లను ఆవిష్కరించారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో విశేష పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. ప్రతీ మంగళవారం, శుక్రవారాల్లో అమ్మవారు ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తామన్నారు. సాయంత్రం వేళల్లో ఆధ్యాత్మిక పారాయణలు జరుగుతాయని తెలియచేశారు.

● కామవరపుకోట: లక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో శ్రావణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ నెల రోజులు అమ్మవారికి ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరుపుతామన్నారు. మహిళలతో సామూహికంగా లలితా పారాయణలు, కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. లలితాదేవి అమ్మవారికి విశేష అలంకరణలతో భక్తులకు దర్శనమిస్తామని తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు అర్బన్ :** ఆయుష్ హాస్పిటల్స్, కొప్పుల వెలమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4న కొత్తపేట సంఘ ప్రాంగణంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ తెలిపారు.
- డెమొక్రటిక్ పీఆర్టీయూ ఏలూరుజిల్లా మాజీ అధ్యక్షుడు వి.గంగాధరరావు సంఘ సభ్యత్వానికి శుక్రవారం రాజీనామా చేశారు. ఎస్‌టీయూలో చేరారని ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి పవన్‌కుమార్ తెలిపారు.
- **ఏలూరు టూటౌన్ :** కారంపూడి ఫౌండేషన్ 22వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. రామకృష్ణ, లంకపల్లి మాణిక్యాలరావు పాల్గొన్నారు.
- **పెదపాడు :** హైస్కూల్‌లో నేషనల్ ప్రోగ్రాం ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండెడ్‌నెస్ పర్యవేక్షణలో జిల్లా బ్లైండెడ్ నెస్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. పారా మెడికల్ అప్తామాలిక్ కె.సురేంద్రబాబు హెచ్.ఎం. పి.వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ చక్రదర్ పాల్గొన్నారు.
- **బుట్టాయగూడెం :** అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఈ నెల 9న కెఆర్‌పురం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించాలని ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ అధికారులకు విజ్ఞప్తి చేసింది.
- **ఉంగుటూరు :** నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచితంగా కంప్యూటర్ కోర్సును (సర్టిఫికెట్ కోర్సు) నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.కె.విశ్వేశ్వరరావు తెలిపారు. రిజిస్ట్రేషన్ కొరకు విద్యార్థులు రూ.100, బయటి వారు రూ.200లు చెల్లించాలన్నారు.
- **జీలుగుమిల్లి :** దర్భగూడెంలో హిందూ ధర్మ ప్రచార మండలి ఆధ్వర్యంలో రామాలయం వద్ద కోలాట, భజనలు ధార్మిక ఉపన్యాసాలు జరిగాయి. అన్నమయ్య కళాకారుల భజన సంఘ అధ్యక్షులు పి.యాదగిరి కేతిరెడ్డి రాజకుమారి, టిఎస్.రవికుమార్ పాల్గొన్నారు.
- **చింతలపూడి :** రేచర్ల పంచాయతీ గిరిజన తండా పాఠశాల విద్యార్థులకు దంత వైద్య శిబిరాన్ని డాక్టర్ బి.రాంబాబు నిర్వహించారు. విద్యార్థులకు దంతపరీక్షలు జరిపి మందులు అందజేశారు.
- **కామవరపుకోట :** పాతూరులోని ఎస్సీలు దాదాపు నాలుగు తరాలుగా అంబేడ్కర్ కాలనీగా ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నామని జిల్లా కెవిపిఎస్ కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ తెలిపారు. తమ ప్రాంతానికి పంచాయతీ వారు రోడ్లు వేయడం జరిగిందని, ఇళ్లకు పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. అధికారులు పట్టాలు ఇవ్వాలని కోరారు.

నెల రోజులుగా పనిచేయని ఏటీఎం



చాట్రాయి, ఆగస్టు 2: చాట్రాయి ఎస్‌బీఐ ఏటీఎం నెల రోజులుగా పనిచేయక పోవటంతో ఖాతాదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలో 45 ఏళ్ళ క్రితం ఏర్పాటైన తొలి బ్యాంకు ఇదే కావటం విశేషం. ఈ బ్యాంకుకు వేలాది మంది ఖాతాదారులు ఉన్నారు. ఏటీఎం పనిచేయకపోవటంతో వ్యయ ప్రయాసలతో విస్సన్నపేట, నూజివీడు వెళ్ళవలసి వస్తోందని వాపోతున్నారు. బ్యాంకు అధికారులు స్పందించి ఏటీఎం పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఏలూరులో వందే భారత్ హాల్ట్‌కు ఎంపీ వినతి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 2: వందేభారత్ రైలు ఏలూరు స్టేషన్‌లో ఆపే విధంగా చర్యలు తీసుకుంటా నని రైల్వే ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేవేందర్ కుమార్ తెలిపి నట్టు ఏలూరు ఎంపీ మహేష్ యాదవ్ తెలిపారు ఢిల్లీ రైల్ భవన్‌లో శుక్రవారం దేవేందర్ కుమార్‌ను ఎంపీ కలిశారు. ఈ సందర్భంగా వందేభారత్ రైలును ఏలూరులో నిలుపుదల చేయాలని కోరాగా సానుకూలంగా స్పందించిన ఆయన వీలైనంత త్వరలో ఏలూరులో వందేభారత్ రైలును హాల్ట్ చేసేందుకు చర్యలు తీసు కుంటానని హామీ ఇచ్చారు.



ముదినేపల్లి సహకార బ్యాంక్ మేనేజర్‌కు కౌలు రైతుల జాబితా అందజేస్తున్న ఏడీఏ

కౌలు రైతులకు రుణాలు ఇవ్వండి

ముదినేపల్లి, ఆగస్టు 2 : కౌలు రైతులకు పంట రుణాలు అందించాలని వ్యవసాయ శాఖ మండవల్లి డివిజన్ ఏడీ జి.వెంకట మణి బ్యాంకర్లను కోరారు. ముదినేపల్లిలోని ఎస్‌బీఐ మేనేజర్ శివ సూర్యనారాయణ, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ బ్రాంచి మేనేజర్ కుమార్‌లతో శుక్రవారం సమావేశం నిర్వహించి కౌలు రైతులకు రుణాలివ్వటం ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉందని, అందుకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. మేనేజర్లకు కౌలు రైతుల జాబితాలను అందజేశారు. ఏవో వేణు మాధవ్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లిలోని కేడీసీసీ బ్యాంక్, లింగాలలో గల సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్లకు అర్హులైన కౌలు రైతుల జాబితాలను సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి, మండవల్లి వ్యవసాయాధి కారిణి షేక్ జరీనా శుక్రవారం అందజేశారు. కౌలు రైతులకు రుణాలు త్వరితగతిన అందించాలని కోరారు. లింగాలలో వరి పొలాలు పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. వీఏఏలు వర్మ, గోపాల్, సుబాని, పలువురు రైతులు పాల్గొన్నారు.



దుర్గమ్మకు ఆషాఢ సారె

ముదినేపల్లి, ఆగస్టు 2 : పెయ్యేరు మండల కార్యాలయాల సమీపంలోని దుర్గమ్మ వారికి శుక్రవారం మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. ముదినేపల్లి మాజీ సర్పంచ్ పామర్తి సత్యనారాయణ, ఆలయ కమిటీ కార్యదర్శి మరడాని సత్యనారాయణ, సభ్యుడు సాయిబాబు దంపతులు, పెయ్యేరు ఉప సర్పంచ్ దివి సతీష్ ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించి అర్చకుడు చాడ శివరామ శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు.

వరి నారుకు డిమాండ్

సెంటు నారు రూ.1000 నుంచి రూ. 1500



ఉండి ప్రాంతానికి వ్యాన్‌లో వరి నారు రవాణా

ముదినేపల్లి, ఆగస్టు 2 : సార్వా వరి నారుకు డిమాండ్ ఏర్పడింది. వర్షాలకు వెదజల్లిన వరి ముంపునకు గురై ముదినేపల్లి మండలంతో పాటు పరిసర మండలాలు, ఇతర జిల్లాల్లో కూడాఆ వందలాది ఎకరాల్లో దెబ్బ తినడంతో తిరిగి నాట్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరి సాగు ఎక్కు వగా ముదినేపల్లి మండలంలోనే జరుగుతున్నందున నారు కొనుగోలుకు పశ్చిమ గోదావరి జిల్లా ఉండి, ఆకివీడు, కాళ్ల మండలాల నుంచి కృష్ణా జిల్లా పెడన, బంటుమిల్లి తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, కౌలు రైతులు వరి నారు కోసం వస్తున్నారు. దీంతో ముదినేపల్లి ప్రాంతంలో వరి నారుకు డిమాండ్ పెరిగింది. డిమాండ్‌తో పాటు ధర కూడా పెరిగింది. సెంటు వరి నారు రూ.1000 నుంచి రూ.1500 వరకు ఇతర జిల్లాల రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువగా ఉండి ప్రాంత రైతులు వర్షాల వల్ల నారుమళ్లు కూడా దెబ్బతినటంతో ఆ ప్రాంతం నుంచే ఎక్కువ మంది రైతులు వరి నారుకు వస్తున్నారు. సెంటు నారు కొనుగోలు, నారు తీత, రవాణా ఖర్చులు కలిపి ఇతర మండలాలకు చేరేటప్పటికీ రూ.2200 అవుతున్నది. వర్షాలకు ముదినేపల్లి ప్రాంతంలో కూడా వెదజల్లిన వరి పైరు దెబ్బ తినటంతో స్థానిక రైతులు కూడా నారు కొనుగోలు చేస్తుండటంతో మరింత డిమాండ్ పెరిగింది.





ఆగిరిపల్లిలో వీధి కుక్కల స్వైర విహారం (ఇన్‌సెట్) పాడి గేదెను చంపేసిన దృశ్యం

చంపేశాయ్..

▸▸ వీధి కుక్కల దాడిలో గేదె మృతి ▸▸ మరో గేదెకు తీవ్ర గాయాలు

ఆగిరిపల్లి, ఆగస్టు 2: వీధికుక్కల దాడిలో పాడి గేదె మృతి చెందగా మరో గేదె తీవ్ర గాయాలపాలైంది. ఆగిరిపల్లికి చెందిన చనుమోలు బాబూరావు తన పాడి గేదెలను గంగానమ్మ గుంట వద్ద గల పొలంలో రాత్రి కట్టివేసి ఉంచగా వీధికుక్కలు దాడిచేసి ఒక గేదెను చంపి మరో గేదెను పూర్తిగా గాయపరిచాయి. సుమారు రూ.80 వేలు విలువ గల గేదెను కుక్కలు పొట్టనపెట్టుకోవడంతో బాబూరావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కలను నిర్మూలించే విషయంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఇలా జరిగిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా కొద్దిరోజులుగా వీధి కుక్కల స్వైర విహారం చేస్తూ ప్రజలపై కూడా దాడిచేయడంతో పలువురు గాయపడ్డారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి చర్యలు

▸▸ బెంగుళూరుకు బస్సు ప్రారంభోత్సవంలో మంత్రి పార్థసారథి

▸▸ బాలికల హాస్టల్ తనిఖీ ▸▸ కళాశాలలో పుస్తకాల పంపిణీ



బెంగుళూరుకు బస్సును ప్రారంభిస్తున్న మంత్రి సారథి

నూజివీడు/ఆగిరిపల్లి, ఆగస్టు 2: నూజివీడు నుంచి బెంగుళూరుకు ఆర్టీసీ బస్సు సర్వీసును మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం ప్రారంభించి కొద్దిసేపు బస్సును స్వయంగా నడిపారు. రాష్ట్రంలో ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సర్వీసులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. నూజివీడులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో గృహ నిర్మాణశాఖలో జరిగిన అవకతవకలపై పలువురు లబ్ధిదారులు ఫిర్యాదు చేయడంతో విచారణ చేస్తున్నామని, నివేదిక రాగానే చర్యలుంటాయన్నారు. సీఎం చంద్రబాబు ఇటీవల సమీక్షలో ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారన్నారు. నూజివీడులో మధ్య తరగతి వారికి తక్కువ ధరలో ఇళ్లు కట్టించి ఇచ్చే ఆలోచనలో ఉన్నామన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, నాసిరకం భోజనం అందిస్తే చర్యలు తప్పవని మంత్రి అధికారులను హెచ్చరించారు. నూజివీడులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సమస్యలపై ఆరా తీశారు. బాలికలకు వసతులు, ఫ్యాన్‌లు తక్షణమే ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం జారీచేసిన నిబంధనల మేరకు మెనూను వసతిగృహాల్లో తప్పనిసరిగా పాటించాలని, తాను మళ్ళీ త్వరలో ఆకస్మిక తనిఖీకి వస్తానని, అప్పుడు ఇలాంటి ఫిర్యాదు అందితే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

రాష్ట్రంలో 2.50 లక్షల మంది కళాశాల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు అందిస్తున్నామని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో చెప్పారు. అలాగే ఆగిరిపల్లి ఎంవీఎన్ అండ్ వైవీఎన్ కళాశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి ఆవరణలో ఫాదర్ జయరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ చర్చ్ ఫాదర్స్, సిస్టర్స్, స్థానిక హాస్టల్ ప్రిన్సిపాల్స్ మంత్రి సారథిని ఘనంగా సత్కరించారు. ఆగిరిపల్లి పెద్ద కొఠాయి నుంచి చిన్నాగిరిపల్లి మీదుగా తోటపల్లి వరకు ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలు పడి అధ్వానంగా ఉన్నందున తక్షణమే రహదారులు నిర్మించాలని మంత్రికి తోటపల్లి సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించారు.

విద్యార్థులకు ఆదర్శం పింగళి వెంకయ్య





కైకలూరు వైవీఎన్నార్ కళాశాలలో.. కలిదిండిలో మానవత పింగళి చిత్రపటం వద్ద నివాళులు

కైకలూరు, ఆగస్టు 2: పింగళి వెంకయ్య జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుజాత అన్నారు. శుక్రవారం పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పింగళి వెంకయ్య జాతీయ జెండాను రూపొందించడం ప్రతి తెలుగువాడికి గర్వకారణమన్నారు. అధ్యాపక బృందం డాక్టర్ పి. వెంకటేశ్వర రావు, శివనాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలో శుక్రవారం మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా సభ్యుడు గోదారి సత్యనారాయణ మాట్లాడుతూ జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య నాడు ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించారని, నేటి యువతరానికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. అనంతరం రంగ స్థల కళాకారుడు మావులూరి బాబురావును సత్కరించారు.



దాత కృష్ణంరాజును సన్మానిస్తున్న కూటమి నేతలు

అన్న క్యాంటీన్ వద్ద బీజేపీ నేత భోజనాల వితరణ

కైకలూరు, ఆగస్టు 2: అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు ఉచితంగా భోజనాన్ని అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కైకలూరులో 45వ రోజు అన్నక్యాంటీన్ ద్వారా బీజేపీ నాయకుడు పెన్మెత్స వెంకట కృష్ణంరాజు ఆర్థిక సాయంతో శుక్రవారం అన్న క్యాంటీన్ లో 400 మంది పేదలకు భోజనాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ దాత కృష్ణంరాజును స్ఫూర్తిగా తీసుకుని దాతలు ముందుకు రావాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, మాజీ వైస్ ఎంపీపీ రహీం, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, టీడీపీ నేతలు పడమటి వాసు, వీరాబత్తిన సుధా, తలారి అన్నిబాబు, జనసేన నాయకుడు మునగాల పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి



కలిదిండి, ఆగస్టు 2 : రేషన్ సరుకులను ఎండీయూ వాహన దారులు సక్రమంగా పంపిణీ చేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఇబ్రహీం అన్నారు. శుక్రవారం ఎండీయూ వాహనాల్లో పంపిణీ చేస్తున్న రేషన్ సరుకులను పరిశీలించి మాట్లాడుతూ ఇకపై లబ్ధిదారులందరికీ 10వ తేదీ కల్లా రేషన్ పంపిణీ పూర్తి చేయాలన్నారు. పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు పాల్గొన్నారు.



స్నేహితుడి కుమారుని వైద్యానికి సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

వైద్యానికి పూర్వ విద్యార్థుల చేయూత

కైకలూరు, ఆగస్టు 2: తామరకొల్లు జడ్పీ హైస్కూల్లో 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడి కుమారుడి వైద్య ఖర్చులకు రూ.31 వేలు ఆర్థిక సహకారాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన పంతగాని కిషోర్ కుమారుడు సాత్విక్ కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి గుడివాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కిషోర్ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో పూర్వ విద్యార్థులంతా రూ.31 వేలు ఆర్థిక సహకారాన్ని అందించారు. పూర్వ విద్యార్థులైన నున్న రాంబాబు, ఉచ్చుల హరిబాబు, లేళ్ళ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



కలిదిండి, ఆగస్టు 2 : భాస్కరరావుపేట జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం సర్పంచ్ గద్దె ఆనంద్ కుమార్, విద్యా కమిటీ మాజీ చైర్మన్ మంతెన సుబ్బరాజు విద్యార్థులకు యూనిఫాం, స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణత సాధించాలన్నారు. హెచ్ఎం కె.పాండురంగారావు, కూటమి నాయకులు వేగిరెడ్డి చిన్నారావు, రంగరాజు, సతీష్ రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఎస్ఐసీ అధికారులు

జాబ్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తాం

ట్రిపుల్ ఐటీని సందర్శించిన ఎన్‌ఎస్ఐసీ అధికారులు

నూజివీడు టౌన్, ఆగస్టు 2: ఇంజనీరింగ్ విద్యార్థులు పరిశ్రమల్లో ఉద్యోగాలు చేసేందుకు అవసరమైన నైపుణ్యంపై శిక్షణ ఇస్తామని నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (ఎన్‌ఎస్ఐసీ) అధికారులు అన్నారు. ఎన్‌ఎస్ఐసీ హైదరాబాద్‌కు చెందిన జీఎం ఎన్‌కె సుబ్రమణి, డిప్యూటీ మేనేజర్ టి.ముత్తుకుమారన్, డిప్యూటీ మేనేజర్ అబ్దుల్ ఖాదర్ నూజివీడు ట్రిపుల్ ఐటీని సందర్శించి క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్‌తో పాటు పలు విభాగాధిపతులతో సమావేశం నిర్వహించి కేంద్ర ప్రభుత్వం సహకారంతో సూక్ష్మ పరిశ్రమల స్థాపన ఎలా చేయాలి అనే అంశాలపై చర్చించారు. అకడమిక్ డీన్ రత్నాకర్, అసోసియేట్ డీన్ డాక్టర్ జ్యోతిలాల్ నాయక్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శ్రావణి, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పశువులకు వైద్య సేవలు



నూజివీడు టౌన్, ఆగస్టు 2: గన్నవరంలోని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో బత్తుల వారిగూడెంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించి 52 పశువులకు గర్భకోశ వ్యాధులకు, 21 పశువులకు సాధారణ వ్యాధులకు వైద్య సేవలందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఏడీ డాక్టర్ ఎస్.రమణారావు, సర్పంచ్ ఎం.లక్ష్మీకాంతం, ఎం.రాజాబాబు, డాక్టర్ అభిలాష్, అభ్యుదయ రైతులు, గొర్రెల, మేకల పెంపకందార్ల సంఘ సభ్యులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించాలని ఆందోళన

ముసునూరు, ఆగస్టు 2: చెక్కపల్లి భగీరథ విగ్రహం సమీపాన గల ప్రభుత్వ స్థలంలో సగర కాలనీకి ఉపయుక్తంగా ఉండేలా నూతన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని నిర్మించాలని శుక్రవారం సగరలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా టి. రాంబాబు, నక్కా లక్ష్మీనారాయణ, కఠారి వెంకటేశ్వరరావు, టి. చిన్న ముసలయ్య, గురవ వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ సగర కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం లేక సుమారు కిలోమీటరు దూరంలోని దివాణం సెంటర్ కేంద్రానికి పిల్లలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అయితే ఈ సగర కాలనీకి 2018లో అంగన్‌వాడీ భవనం మంజూరైనట్టు నాటి అధికారులు చెప్పారే తప్ప పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకువెళ్తామని వారు తెలిపారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



కైకలూరు, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవా రం వరహాపట్నంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఇంటి వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మాదిగ సోదరులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో చొరవ చూపిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. 30 ఏళ్లుగా కోర్టులో పోరాటం చేసిన మందకృష్ణకు అభినందనలు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు కట్టా వీరరాఘవులు, జిల్లా ఎస్సీ మోర్చ కార్యదర్శి ఏసుపాదం, పామర్తి రాంబాబు పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో అందుబాటులో కామినేని

కైకలూరు, ఆగస్టు 2: ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఈ నెల 4న కైకలూరు నియోజకవర్గంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. ఉదయం 9.30 గంటలకు లోకుమూడి దత్తాశ్రమంలో నిర్వహించే ఉచిత వైద్యశిబిరంలో పాల్గొంటారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ట్రావెలర్స్ బంగ్లాలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 5వ తేదీ ఉదయం 9.30 గంటలకు కైకలూరు మీసాల వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభిస్తారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు చటాకాయ్‌లో, 4.30 గంటలకు కొట్టాడలో వాటర్ ఫిల్టర్స్‌ను ప్రారంభిస్తారు. అనంతరం చిన్నకొట్టాడలో గ్రామపెద్దలతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. రాత్రికి వరహాపట్నంలోని ఇంటివద్దే అందుబాటులో ఉంటారు. 6వ తేదీ ఉదయం కోరుకొల్లు ఉచిత పుస్తకాల పంపిణీని ప్రారంభిస్తారు. అనంతరం విజయవాడలో అధికారులతో జరిగే సమావేశంలో పాల్గొంటారు.

పోలీసు షార్ట్ ఫిలిం కాంటెస్ట్‌కు ఆహ్వానం

ఏలూరు క్రైం, ఆగస్టు 2 : మహిళలు, బాలబాలికల రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలపై షార్ట్ ఫిలిం పోటీని నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. షార్ట్‌ఫిలిం ఒక నిమిషం నుంచి రెండు నిమిషాల నిడివితో ఉండా లని జిల్లా అధికారులకు ఈనెల 13వ తేదీలోపు సెల్‌ఫోన్ నెంబరు 99488 90429కు వీడియో పంపాలని సూచించారు. అధికారులు పరిశీలించి మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, మూడో బహుమతి రూ. 3 వేలు ఆగస్టు 15న అందిస్తారన్నారు. ఉత్సాహవంతులైన విద్యార్థిని విద్యార్థులు, ప్రజలు ఈ కాంటెస్ట్‌లో పాల్గొని బహు మతులు పొందాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



మండవల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



చెక్కపల్లిలో అవగాహన ర్యాలీ



కైకలూరులో పోస్టరును ఆవిష్కరిస్తున్న సూపర్‌వైజర్ లావణ్య



గొల్లపల్లిలో తల్లి పాల విశిష్టతను వివరిస్తున్న సీడీపీవో నురాని

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం

▸▸ తల్లిపాల వారోత్సవాల్లో వక్తలు

▸▸ 6 నెలల వరకు పట్టాలని సూచన

▸▸ గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

కైకలూరు, ఆగస్టు 2: పుట్టిన బిడ్డకు అరగంటలో తల్లిపాలను అందిస్తే పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. లావణ్య అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కైకలూరు బైపాస్ రోడ్డులోని అంగన్వాడీ కేంద్రంలో ఆమె మాట్లాడుతూ తల్లి పాలు ఇవ్వడం వల్ల తల్లీబిడ్డకు మంచిదన్నారు. ఈ నెల 7 వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది శ్రీనివాసు, సూపర్‌వైజర్లు లక్ష్మి, తాతారావు, అంగన్వాడీలు, ఆశావర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ముదినేపల్లి: బిడ్డల ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో మేలు చేస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న తెలిపారు. బొమ్మినంపాడులో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో బిడ్డ పుట్టగానే తల్లిపాలు పట్టిస్తే ఆ బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఎంపీటీసీ అరుణ కుమారి, అంగన్‌వాడీ టీచర్ పద్మావతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కలిదిండి: తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కరుణ కుమారి అన్నారు. శుక్రవారం కొండూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టించడం బిడ్డ పాలిట వరం లాంటిదన్నారు. అంగన్‌వాడీ టీచర్స్ ఎం.విశాల, జి.రామతులసి, బాలింతలు, గర్భవతులు పాల్గొన్నారు.

మండవల్లి: తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని కైకలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వి. దీప్తి అన్నారు. శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్. వెంకట నాగలక్ష్మి ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీప్రసన్న, హెల్త్ సూపర్‌వైజర్, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాలొన్నారు.

నూజివీడు టౌన్: శిశువులకు ఆరు నెలలు వచ్చే వరకు తల్లి పాలు పట్టించాలని సీడీపీవో సయ్యద్ నురాని తల్లులకు సూచించారు. గొల్లపల్లిలో తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని తల్లులకు తల్లిపాల విశిష్టతను, బిడ్డలకు కలిగే లాభాలను వివరించారు. సామూహిక సీమంతాలు చేశారు. సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, ఏసీడీపీవో నాగేశ్వరి, సూపర్‌వైజర్ రమాదేవి, ఏఎన్‌ఎంలు పద్మ, ప్రిస్కిల్లా, ఆశ, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ముసునూరు: పిల్లలకు తల్లిపాలు సమృద్ధిగా ఇచ్చినప్పుడే వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీటీసీ కాటేపల్లి పుష్పావతి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం చెక్కపల్లి, చింతలవల్లి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహించి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంట లోపు తల్లి పాలు ఇవ్వడం వల్ల, అనేక పోషకాలు బిడ్డకు అందుతాయని, పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని అవగాహన కల్పించారు. ర్యాలీల్లో సర్పంచ్‌లు టి. రాదికా సత్యనారయణ, పిల్లి సత్యనారాయణ, వార్డు సభ్యుడు చెన్ను పంగిడయ్య, ఏఎన్ఎం భాగ్యలక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ వై జమునారాణి, మహిళా పోలీస్ భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బొమ్మినంపాడులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న